RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 07 అక్టోంబర్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:111

## ఎర్రవల్లి గ్రామ సర్వే నంబర్ 325 సర్వే పై రేవంత్ రెడ్డి సమీక్ష..

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల భూముల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష..

రెండు గ్రామాల్లో సర్వే వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేసిన అధికారులు.

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి..

రెవెన్యూ అధికారుల సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తింపు..

సర్వే నంబర్‌లో మిస్ అయిన 45 ఎకరాల భూమి..

45 ఎకరాలు ఎక్కడుందో తేల్చాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి.

భూమి గుర్తింపు కోసం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ విడుదల..

భూమి సరిహద్దులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రెవెన్యూ రికార్డులు సబ్మిట్ చేయాలని నోటీసులు జారీ చేయనున్న అధికారులు..

సర్వే నంబర్ 325లో ఉన్న భూమిని స్థానిక అర్హులైన రైతులకు పంపిణీ చేయనున్న ప్రభుత్వం..

సర్వే నంబర్ 325లో తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణం చేయాలని ఆదేశించిన ముఖ్యమంత్రి.



తెలంగాణ అమరవీరుల కాలనీలో అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, సకల సౌకర్యాలతో కాలనీ ఏర్పాటు చేయాలని సూచన.

కాలనీనిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని సూచించిన సీఎం.

జూన్ 2లోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశాలు..

## ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు.. అతి కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు!

**ప్రభుత్వాధినేతగా నిరంతరాయంగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీ**
**సిక్కిం మాజీ సీఎం పవన్ చామ్లింగ్ రికార్డును అధిగమించిన ప్రధాని**
**ఒడిశాలో నవీన్ పట్నాయక్,**
**బెంగాల్‌లో జ్యోతిబసు పేరిట సుదీర్ఘ పాలన రికార్డులు**
**ప్రపంచంలో లీ క్వాన్ యూ, హున్ సేన్ వంటి నేతల సరసన చేరిన మోదీ**
**ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంలో ఈ ఘనత సాధించడం విశేషం**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 అక్టోబర్ 7న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు, ప్రధానమంత్రిగా కొనసాగుతూ.. ప్రభుత్వ అధినేతగా నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. పాతికేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన అతికొద్ది మంది ప్రపంచ నేతల జాబితాలో ఆయన స్థానం సంపాదించారు.

మిగతా 3 లో




# ఎన్నికల కమీషనర్లను కలవడం మా హక్కు రాహుల్‌గాంధీ






ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద విపక్షాల నిరసన కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. ఓటర్ల జాబితా అవకతవకలకు బాధ్యులైనవారెవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు.

ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద విపక్షాల నిరసన కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. ఓటర్ల జాబితాఅవకత వకలకు బాధ్యులైనవారెవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా అక్రమాలపై తమ పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన మార్చ్‌ను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు వచ్చారని రాహుల్ గాంధీ తెలిపారు. ఎన్నికల సంఘం కార్యాలయం కొద్ది దూరంలోనే ఉన్నప్పటికీ తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. తాము దేశ ప్రజల ప్రతినిధులమని, ఎన్నికల కమిషనర్లను కలవడం తమ హక్కు అని రాహుల్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక గాంధీ , ఇండియా కూటమీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులు, జైళ్లు, లాఠీఛార్జీలు గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ నేతలకు కొత్త కాదు రేవంత్ రెడ్డి



వార్తా 2 లో

## ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలిస్తాం

**ఇందిరమ్మ టవర్స్ వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు**
**5,218 మంది అర్హుల నుంచి లక్కీ డ్రా.. 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు**
**పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**కుత్బుల్లాపూర్ ప్రజాబలం ప్రతనిధి:** హైదరాబాద్ :- క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్ధేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కే.పీ, వివేకానంద, పలువురు లబ్దిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు.



మిగతా 3 లో

# ప్రజాబలం

07 అక్టోంబర్ 2026 బుధవారం


## ఆందోళన కల్గిస్తున్న యువకుల మరణాలు

ఇటీవల కాలంలో పురుషుల మరణాలు పెద్ద సంఖ్యలో చోటుచేసుకుంటున్నాయని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. మహిళలతో పోలిస్తే పురుషుల మరణాలు ఆందోళనకర రీతిలో పెరుగుతున్నట్టు పేర్కొంది. ముఖ్యంగా 15 నుంచి 64 ఏళ్ల మధ్య వయసు గల పనిచేసే, కుటుంబాలను పోషించే వయస్సు ఉన్న పురుషులలో ఈ తేడా అత్యంత తీవ్రంగా ఉందని తెలిపింది. నివేదిక ప్రకారం.. తమిళనాడులో గతేడాది నమోదైన మొత్తం మరణాల్లో 4,01,860 పురుషులు కాగా, 2,91,347 మహిళలు ఉన్నారు. మహిళల కంటే పురుషుల మరణాలు ఏకంగా 1,10,513 ఎక్కువ. గత మూడేళ్లుగా పురుషులు, మహిళల మరణాల మధ్య వ్యత్యాసం లక్షకు పైగానే ఉండటం గమనార్హం. 2023లో 1.10 లక్షలు, 2024లో 1.07 లక్షలు, 2025లో 1.11 లక్షలు.వీరిలో దాదాపు 86 శాతం (94,792 మరణాలు) తమ జీవితంలో అత్యంత కీలకమైన ఉత్పాదక దశలో ఉన్నవారే కావడం మరింత ఆందోళనకరం. ప్రజారోగ్య శాఖ డైరెక్టరేట్ ఓ మెడికల్ జర్నల్‌లో ప్రచురించిన 2018–2022 మధ్య పౌర నమోదు వ్యవస్థ డేటా విశ్లేషణ ప్రకారం.. ప్రతి జిల్లాలో 15 ఏళ్ల వయస్సు దాటినవారిలో మహిళల కంటే పురుషుల మరణాలే ఎక్కువగా ఉన్నాయని తేలింది.నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ టి. సుందరరామన్ మాట్లాడుతూ.. ఈ గణాంకాలు కేవలం జనాభాకు సంబంధించినవి మాత్రమే కాదని అన్నారు. “చాలా చిన్న వయసులో కుటుంబాలు తండ్రులను కోల్పోతున్నాయి. మహిళలు వితంతువులవుతున్నారు. యువత జీవితాలను కాపాడటానికి మనం పెట్టుబడులు పెట్టాలి” అని ఆయన అన్నారు.గతేడాది 15 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 9,167 మంది, మహిళలు 4,461 మంది ప్రాణాలు కోల్పోయారు. 25 - 34 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 17,135, మహిళలు 6,177.. 35 - 44 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 31,585, మహిళలు 11,406 మంది, 45 - 54 ఏళ్ల మధ్య మహిళల కంటే పురుషుల మరణాల సంఖ్య 28,474 ఎక్కువ. 55 - 64 ఏళ్లలో మహిళల కంటే 30,475 మరణాలు ఎక్కువ కాగా.. 70 ఏళ్లు దాటిన తర్వాత ఈ వ్యత్యాసం తగ్గింది. పురుషులు 1,55,093 మంది చనిపోతే.. మహిళలు 1,50,545 మంది ప్రాణాలు కోల్పోయారు.ప్రజా ఆరోగ్య నిపుణుల విశ్లేషణ ప్రకారం పురుషుల మరణాలకు యువతలో ప్రమాదాలు, ఆత్మహత్యలు: రోజుకు సగటున 50 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లోనూ, అంతే సంఖ్యలో ఆత్మహత్యల వల్ల మరణిస్తున్నారు. గుండె జబ్బులు, పక్షవాతం, కిడ్నీ వైఫల్యం, మధుమేహం, శ్వాసకోశ వ్యాధులు, అలాగే పొగాకు, మద్యం వాడకం వల్ల వచ్చే తీవ్ర అనారోగ్యాలు.మహిళలకు గర్భధారణ, ప్రసవానంతరం ఆరోగ్య పరీక్షలు క్రమంగా జరుగుతాయి. కానీ చాలామంది పురుషులు 40 ఏళ్లు వచ్చే వరకు ఎలాంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం లేదు. తమిళనాడులో నమోదైన మొత్తం 6,93,207 మరణాలలో కేవలం 2,80,856 మరణాలు (41%) మాత్రమే వైద్యపరంగా ధ్రువీకరించనవి. పురుషుల మరణాలలో 42%, మహిళల మరణాలలో 38% మాత్రమే మెడికల్ సర్టిఫికేషన్ పొందాయి.ఆ రాష్ట్రంలో ప్రతి 10 మరణాల్లో 6 ఆసుపత్రుల వెలుపలే జరుగుతున్నాయి. ఆసుపత్రుల బయట జరిగే మరణాలకు గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి ‘వెర్బల్ అటాప్సీ’ వంటి విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.స్వీడన్‌లో 2025లో 46,000 మంది పురుషులు, 46,200 మంది మహిళలు మరణించారు. అక్కడ మరణాల సంఖ్య ఇరు వర్గాల్లో దాదాపు సమానంగా ఉన్నప్పటికీ, స్వీడన్‌లో కేవలం 10% మరణాలు మాత్రమే 65 ఏళ్ల వయస్సు కంటే ముందు జరుగుతాయి. అదే మన దేశంలో అయితే 42% మరణాలు 65 ఏళ్ల కన్నా ముందే సంభవిస్తున్నాయి.దీర్ఘకాలిక వ్యాధులు, రోగాలను గుర్తించేందుకు ఇంటి వద్దకే వైద్య సేవలు, నిర్మాణ కార్మికులకు హెల్త్ చెకప్‌లు అందిస్తున్నారు. కూలీ కోల్పోతామనే భయంతో పగటిపూట ఆసుపత్రులకు రాని పురుషుల కోసం సాయంత్రం వేళల్లో క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. ఇక్కడ బీపీ, షుగర్ తనిఖీలు చేస్తున్నారు. ఉపాధి కోసం ద్విచక్రవాహనాలపై ప్రయాణించే పురుషుల భద్రత దృష్ట్యా రోడ్డు భద్రతా చర్యలను తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉంది. పురుషుల అకాల మరణాలను నివారించడం అనేది కేవలం వారి ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, అది కుటుంబ ఆర్థిక భద్రతకు. మహిళలు, పిల్లల భవిష్యత్తుకు రక్షణ అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# విద్యారంగంలో శాశ్వత మార్పులకు భారీ పెట్టుబడులు

**పిల్లల పౌష్టికాహారం, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం: భట్టి, ఉత్తమ్**
**60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించేలా మునగాలలో మెగా కిచెన్**
**ఉత్తమ్, పద్మావతి విజ్ఞప్తితో సింగరేణి నుంచి రూ.9.60 కోట్ల సహకారం**
**వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే**
**గడ్డిపల్లి పాఠశాల పూర్తి చేయాలని ఆదేశం**






హైదరాబాద్/సూర్యాపేట, అక్టోబర్ 6: విద్యారంగంలో శాశ్వత మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెడుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం, నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు అందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యాధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు మంగళవారం భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం గడ్డిపల్లిలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు.

**రోజూ 60 వేల మందికి పౌష్టిక అల్పాహారం**

మునగాల కమ్యూనిటీ కిచెన్ ద్వారా సూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం అందించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, విద్యాసంస్థలకు పంపిణీ వరకు సమగ్ర వ్యవస్థను రూపొందిస్తున్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ ప్రాజెక్టుకు రూ.9.60 కోట్ల ఆర్థిక సహకారం అందిస్తోంది.

శంకుస్థాపన కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడం వారి ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడమేనని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలను కేవలం ఉచితాలుగా చూడొద్దని సూచించారు. కుటుంబాలను బలోపేతం చేసి, ప్రజలు రాష్ట్రాభివృద్ధిలో మరింత సమర్థంగా భాగస్వాములయ్యేందుకు ఇవి తోడ్పడతాయని వివరించారు.

**విద్యతోపాటు పౌష్టికాహారం అవసరం**

పిల్లల ఎదుగుదలకు తరగతి గదిలో అందించే విద్యతోపాటు పౌష్టికాహారం కూడా అవసరమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. చిన్న వయసు నుంచే సరిపడా ఆరోగ్యకరమైన ఆహారం అందితే వారి అభ్యసనానికి తోడ్పడుతుందని చెప్పారు.

మునగాల కిచెన్ ద్వారా ప్రారంభంలో దాదాపు 60 వేల మందికి అల్పాహారం అందిస్తామని, భవిష్యత్తులో లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అల్పాహారంతోపాటు పాలు, రాగిజావ అందిస్తామని చెప్పారు.

ఆహార నాణ్యత, పౌష్టిక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని ఉత్తమ్ తెలిపారు. అవసరాలను బట్టి ఎంపిక చేసిన జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించేలా కూడా కార్యక్రమాన్ని విస్తరించే అవకాశం ఉందని అధికారులు వివరించారు.

విద్యార్థుల సంక్షేమం, హాజరు, అభ్యసన ఫలితాలు, విద్యావకాశాలను మెరుగుపరిచే ప్రభుత్వ ప్రయత్నాలకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందని ఉత్తమ్ అన్నారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేసుకుంటూ కిచెన్ నిర్మాణం, నిర్వహణను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పారు.

**పాఠశాల పనులకు వారాల వారీ ప్రణాళిక**

గడ్డిపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు.

అనుకున్న ప్రకారం ప్రవేశాలు ప్రారంభించేందుకు వీలుగా అధికారులు, నిర్మాణ సంస్థ వారాల వారీగా సమగ్ర పనుల ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. నిర్ణయించిన కాలపట్టికకు అనుగుణంగా పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.ఆధునిక తరగతి గదులు, వసతి గృహాలు, క్రీడా సదుపాయాలు, ఇతర విద్యార్థి వసతులన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా గడ్డిపల్లి పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి తెలిపారు.

గ్రామీణ తెలంగాణ భవిష్యత్తుపై పెట్టుబడిగా ఈ పాఠశాలను అభివర్ణించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ప్రముఖ పాఠశాలలతో సమానమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

గ్రామీణ, గురుకుల విద్యాసంస్థల్లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మౌలిక వసతుల కొరతను ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా పరిష్కరిస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. అనేక విద్యాసంస్థలు అద్దె భవనాల్లో లేదా సరిపడని భవనాల్లో నడుస్తూ తరగతి గదులు, వసతి, పారిశుధ్య సదుపాయాల కొరతను ఎదుర్కొన్నాయని చెప్పారు. గ్రామీణ పిల్లలకు కూడా ఇతర ప్రాంతాల్లో లభించే నాణ్యమైన విద్య, సదుపాయాలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 105 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 105 పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రూ.200 కోట్లతో చేపట్టిన గడ్డిపల్లి పాఠశాల ఈ కార్యక్రమంలో భాగమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీతోపాటు ఇతర వర్గాల విద్యార్థులు కలసి చదువుకునేలా నాణ్యమైన విద్య, వసతి, క్రీడా సదుపాయాలు, సమగ్ర విద్యార్థి సహాయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు.

గడ్డిపల్లి ప్రాజెక్టును మంజూరు చేయడంతోపాటు మారుమూల ప్రాంతానికి స్వయంగా వచ్చి పనులను సమీక్షించిన భట్టి విక్రమార్కకు ఉత్తమ్ కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణ సంస్థకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూస్తున్న ఆర్థిక శాఖకు ధన్యవాదాలు చెప్పారు. భూమి, అనుమతులు, పాఠశాలకు చేరుకునే రహదారి ఏర్పాట్లలో సహకరించిన సూర్యాపేట జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. పాఠశాల, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

**హుజూర్‌నగర్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం**

గడ్డిపల్లి పాఠశాలతో హుజూర్‌నగర్ నియోజకవర్గం, పరిసర గ్రామీణ ప్రాంతాల పిల్లలకు ఇంటికి చేరువలోనే నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఉత్తమ్ తెలిపారు. హుజూర్‌నగర్‌ను తెలంగాణలోని అగ్రగామి నియోజకవర్గాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తానని తెలిపారు.

మునగాల కమ్యూనిటీ కిచెన్, గడ్డిపల్లి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా గ్రామీణ సూర్యాపేటలోని పిల్లల జీవన ప్రమాణాలు, పౌష్టికాహారం, విద్యావకాశాలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రులు పేర్కొన్నారు.

కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అరెస్టులు, జైళ్లు, లాఠీఛార్జీలు గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ నేతలకు కొత్త కాదు రేవంత్ రెడ్డి







రాహుల్ గాంధీ అరెస్టుపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం.. SIRపై పోరాటం ఆపేది లేదని స్పష్టం..

హైదరాబాద్: ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అరెస్టును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అహింసాయుతంగా ఉద్యమిస్తున్న నాయకులను బలవంతంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికే విరుద్ధమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దన్నారు. అరెస్టులు చేసి, జైళ్లలో పెట్టినంత మాత్రాన ఎన్నికల కమిషన్ తప్పులపై కాంగ్రెస్ పోరాటం ఆపదని రేవంత్ స్పష్టం చేశారు.

ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో తప్పిదాలకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ విశ్రమించదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కాగా, సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ఇండియా కూటమి మంగళవారం పార్లమెంట్ స్ట్రీట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు మార్చ్ చేపట్టింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కూటమికి చెందిన దాదాపు 300 మంది ఎంపీలు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున మార్చ్ చేపట్టారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈసీ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.

అయితే, కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. పెద్దఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేసి నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బారికేడ్లు ఎక్కి మరీ రాహుల్ గాంధీ నిరసన తెలిపారు. వాటిని తొలగించుకుని మరీ ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో రాహుల్ సహా కాంగ్రెస్ అగ్ర నాయకులు ఎంపీ ప్రియాంక గాంధీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పోలీసులు అరెస్టు చేశారు. పలువురు ఎంపీలు, కాంగ్రెస్ నేతలనూ అదుపులోకి తీసుకున్నారు. దీంతో దేశ రాజధానిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

## మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబులకు టీయూడబ్ల్యూజే ప్రతినిధుల వినతి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబర్ 6:** అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు, గృహాలను కేటాయించి వారి ఇళ్ల సమస్యను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కమిటీ కోరింది.

కుత్బుల్లాపూర్‌లో గృహ సముదాయ భవనాల శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను టీయూడబ్ల్యూజే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది.

ఈ సందర్భంగా అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని మంత్రులను ప్రతినిధి బృందం కోరింది. జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. జర్నలిస్టులకు తమ ప్రభుత్వ హయాంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, కార్యదర్శి మల్లేష్,శ్రీనివాస్,జనార్ధన్ రెడ్డి తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలిస్తాం





మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు.

ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని



మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు.

ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. “మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి.. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి” అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఓట్ల తొలగింపుపై ప్రశ్నిస్తే అరెస్టులా?

## కేంద్రం తీరుపై మంత్రి పొన్నం ఫైర్

## రాహుల్, ప్రియాంకల అరెస్టు అప్రజాస్వామికం

## గ్రామాల్లో ‘దేశ్ బచావో.. ఓట్ బచావో’ ఉద్యమం

**సిద్దిపేట ప్రజాబలం ప్రతనిధి:** ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కని, దాన్ని కాలరాయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శ్రీరాములపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.





?ఓటర్ల జాబితా సవరణ పేరిట గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, అర్హులైన ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించకుండా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు.

ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు, ఈసీ అక్రమాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పోలీసులు అరెస్టు చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేసే హక్కును కూడా కేంద్రం లాక్కుంటోందని ధ్వజమెత్తారు.

?దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఈసీ వైఖరిని ఎండగడుతున్నా మోదీ సర్కారు నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతి ఓటరు హక్కును కాపాడేందుకు ‘దేశ్ బచావో.. ఓట్ బచావో’ పేరిట పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు.. అతి కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు!

మొదటి పేజీ తరువాయి

భారతదేశంలో, ఎన్నికైన ప్రభుత్వానికి అధిపతిగా సుదీర్ఘకాలం పనిచేసిన రికార్డును మోదీ ఇప్పటికే అధిగమించారు. గతంలో ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ నేత అయిన చామ్లింగ్ డిసెంబర్ 1994 నుంచి మే 2019 వరకు మొత్తం 24 సంవత్సరాల 165 రోజుల పాటు సీఎంగా పనిచేశారు.

దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జ్యోతిబసు కూడా ఉన్నారు. బిజూ జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ మార్చి 2000 నుంచి జూన్ 2024 వరకు 24 సంవత్సరాల 99 రోజుల పాటు సీఎంగా సేవలందించారు. ఆయన తన స్వచ్ఛమైన ఇమేజ్, విపత్తు నిర్వహణ సామర్థ్యం, మహిళా సాధికారత కార్యక్రమాలతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక, సీపీఎం నేత జ్యోతిబసు జూన్ 1977 నుంచి నవంబర్ 2000 వరకు 23 సంవత్సరాల 137 రోజుల పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలో అమలు చేసిన భూ సంస్కరణలు, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు.

అంతర్జాతీయంగా చూస్తే, సింగపూర్ తొలి ప్రధాని లీ క్వాన్ యూ 1959 నుంచి 1990 వరకు ఏకంగా 31 ఏళ్లు నిరంతరాయంగా అధికారంలో ఉన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో సుదీర్ఘ పాలనకు ఆయనను ఒక ఆధునిక కొలమానంగా పరిగణిస్తారు. ఆయన నాయకత్వంలో సింగపూర్ పేదరికం నుంచి ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో ఒకటిగా ఎదిగింది. కంబోడియాలో హున్ సేన్ 1985 నుంచి 2023 వరకు ప్రధానిగా పనిచేసి, ఆధునిక ప్రపంచంలో ఎక్కువ కాలం పనిచేసిన నేతల్లో ఒకరిగా నిలిచారు. మలేషియాలో మహతీర్ మొహమ్మద్ రెండు పర్యాయాల్లో కలిపి 24 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేశారు.

ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత పోటీతత్వ ప్రజాస్వామ్యంలో వరుస ఎన్నికల విజయాలతో ఈ 25 ఏళ్ల మైలురాయిని చేరుకోవడం మోదీ విషయంలో ఒక ప్రత్యేకతగా నిలుస్తోంది. “వికసిత భారత్” లక్ష్యంతో ఆయన ప్రస్థానం ఇంకా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న అనేక మంది నేతలు వివాదాస్పద పాలకులుగా ముద్రపడగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికవుతూ మోదీ ఈ ఘనత సాధించడం గమనార్హం.

# గోషామహల్‌లో ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర: అసదుద్దీన్ ఒవైసీ

## ముస్లిం ఓటర్లే లక్ష్యంగా కుట్ర జరుగుతోందన్న ఒవైసీ

## పెద్ద సంఖ్యలో ఫారం-7 దరఖాస్తులు సమర్పిస్తున్నారని ఆరోపణ

## వారిపై కేసులు నమోదు చేయాలని ఒవైసీ డిమాండ్

గోషామహల్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి ఉద్దేశపూర్వకంగా తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా బల్క్ దరఖాస్తుల ద్వారా ఈ ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు.



హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గోషామహల్‌లోని బూత్ నంబర్ 28, 30, 127లో ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించేందుకు ముందుగానే ప్రింట్ చేసిన ఫారం-7 దరఖాస్తులను సమర్పిస్తున్నారని ఆరోపించారు. ఈ ఓటర్లందరి పేర్లు కనీసం 2002 నుంచి జాబితాలో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఒకే వ్యక్తి 122 దరఖాస్తులు ఎలా సమర్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కుట్ర వెనుక బీజేపీ నాయకులు ఉన్నారని ఒవైసీ ఆరోపించారు.

బల్క్‌గా, తప్పుడు ఫారం-7 దరఖాస్తులు దాఖలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియను పాత పద్ధతిలోనే జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఖరీఫ్ ఎరువుల పంపిణీ విజయవంతం, పకడ్బందీగా ఎరువుల సరఫరా మంత్రి తుమ్మల

గత ఖరీఫ్ తో పోల్చుకుంటే 35 వేల టన్నుల వాడకం తక్కువఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల పంపిణీ విజయవంతంగా జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందస్తుగానే ఎరువులను పొజిషన్ చేయడం, షిప్‌మెంట్లను వేగంగా రాష్ట్రానికి తీసుకురావడం, ఫెర్టిలైజర్ యాప్ ద్వారా పంపిణీని పర్యవేక్షించడం వంటి చర్యలతో ఎరువుల పంపిణీని సక్రమంగా నిర్వహించామని మంత్రి పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే ఎరువుల లభ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందస్తుగానే స్టాక్స్‌ను పొజిషన్ చేయడంతో పాటు, దిగుమతి చేసుకునే ఎరువుల విషయంలో షిప్‌యార్డుల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేశామని చెప్పారు. షిప్‌మెంట్లు ఆలస్యం కాకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేస్తూ, షిప్‌యార్డుల నుంచి రాష్ట్రానికి ఎరువులు త్వరితగతిన చేరేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ?ఫెర్టిలైజర్ యాప్‌తో పంపిణీలో పారదర్శకత...కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసి, ఎరువుల పంపిణీ ప్రక్రియను డిజిటల్ విధానంలోకి తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా ఎక్కడ ఎంత ఎరువుల నిల్వ ఉంది.. ఎంత పరిమాణంలో బుకింగ్ జరిగింది.. ఎంత మేరకు రైతులు ఎరువులను కొనుగోలు చేశారు అనే వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఏర్పడిందన్నారు. అంతకుముందే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా యాప్‌ను సమర్థవంతంగా అమలు చేసి, ఎరువుల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో విజయం సాధించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో యూరియా పంపిణీని పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన యూరియా యాప్ విజయవంతమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని మరింత విస్తృత స్థాయిలో అమలు చేసేందుకు జాతీయ ఫెర్టిలైజర్ యాప్‌ను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు.

# ప్రమాణాలు రూపొందించడమే కాదు.. క్షేత్రస్థాయిలో సురక్షిత రహదారుల నిర్మాణమే లక్ష్యం

**2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించేందుకు సమిష్టి కృషి అవసరం**

**బ్లాక్ స్పాట్లను గుర్తించడం కాదు.. శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలు చూపాలి**

**డిజైన్ నుంచి నిర్మాణం, నిర్వహణ వరకు ప్రతి దశలోనూ భద్రతకు ప్రాధాన్యత**

**భూసేకరణ, రైట్ ఆఫ్ వే రహదారి భద్రతలో కీలక అంశాలు**

**- హైదరాబాద్ - విజయవాడ NH - 65 రహదారి పై**

**నిత్యం జరుగుతున్న ప్రమాదాలు ఆందోళనకరం**

**- 6o2 లేన్ విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలి**

**రోడ్డు భద్రత ఆడిట్లు నిరంతర ప్రక్రియగా కొనసాగాలి**

**- కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి**

**- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**






**గుజరాత్ (ఏక్తానగర్):**గుజరాత్ రాష్ట్రం నర్మద జిల్లాలోని ఏక్తానగర్‌లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న చింతన్ శివిర్-- 2026 రెండో రోజు కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి "సురక్షిత రహదారుల రూపకల్పన -- ప్రమాణాల నుంచి అమలు వరకు" అనే అంశంపై జరిగిన ప్రత్యేక సెషన్‌కు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మంత్రి కీలకోపన్యాసం చేశారు.

మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి »»Designing Safe Highways From Standards to Implementationµ’సెషన్ లో మాట్లాడుతూ...

రహదారి భద్రతకు సంబంధించి ప్రమాణాలు, మార్గదర్శకాలు రూపొందించడం మాత్రమే సరిపోదని, వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, సురక్షితమైన రహదారిని అందించడమే అసలైన లక్ష్యమన్నారు.

ఈ ముఖ్యమైన అంశంపై చర్చకు నాయకత్వం వహించే అవకాశం కల్పించిన కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు, మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్యానల్ సభ్యులుగా ప్రత్యేక కార్యదర్శి వినయ్ కుమార్ రాజావత్, జాయింట్ సెక్రటరీ సీహెచ్. సింగ్, ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సెక్రటరీ జనరల్ రాహుల్ గుప్తా, ఐఐటీ కాన్పూర్ డీన్, ప్రొఫెసర్ నితిన్ సక్సేనా, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ వెంకటేశ్ బాలసుబ్రమణియన్, ఎన్‌హెచ్‌ఐడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) అమరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

వీరితో పాటు NHAI ఛైర్మన్ సంతోష్ యాదవ్,MoRTH సెక్రటరీ ఉమాశంకర్ కూడా ప్యానెల్ డిస్కషన్ లో మంత్రి లేవనెత్తిన హైదరాబాద్- విజయవాడ NH-65 అంశంపై మాట్లాడారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం రహదారి భద్రత రంగంలో ఎదుర్కొంటున్న సవాళ్లు, అనుభవాలు, వినూత్న విధానాలను ఇతర రాష్ట్రాలతో పంచుకునే అవకాశం ఈ చింతన్ శివిర్ ద్వారా లభించిందని అన్నారు.

అంతర్జాతీయ అనుభవాల నుంచి నేర్చుకోవాలి

ఇటీవల తాను పలు దేశాల్లో పర్యటించి రహదారి భద్రతకు సంబంధించిన అనేక ఉత్తమ విధానాలను పరిశీలించానని మంత్రి తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు రోడ్డు భద్రతను కేవలం ఇంజినీరింగ్ అంశంగా కాకుండా ప్రత్యేక వృత్తిపరమైన విభాగంగా పరిగణిస్తున్నాయని చెప్పారు.

స్వీడన్ అమలు చేస్తున్న 'విజన్ జీరో' విధానం నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. రహదారిపై ఒక్క మరణం లేదా తీవ్ర గాయం కూడా ఆమోదయోగ్యం కాదన్న ఆలోచనను భారత పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆస్ట్రేలియా అనుసరిస్తున్న 'సేఫ్ సిస్టమ్' విధానం మానవ తప్పిదాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, వాహనాలు, వేగ పరిమితులను రూపొందిస్తోందని చెప్పారు. అమెరికా ఫెడరల్ హైవే అడ్మినిస్ట్రేషన్ అనుసరిస్తున్న రోడ్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్‌లు, సాంకేతిక మార్గదర్శకాలను కూడా భారత రహదారుల పరిస్థితులకు అనుగుణంగా స్వీకరించవచ్చన్నారు.

రోడ్డు భద్రతకు ప్రత్యేక నిపుణుల వ్యవస్థ అవసరం

ప్రాజెక్టుల అమలులో ప్రస్తుతం ఉన్న ఇంజినీరింగ్ వ్యవస్థలకు తోడుగా స్వతంత్ర రోడ్డు భద్రత నిపుణుల వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు.

రోడ్డు భద్రత ఆడిట్లు ఒకసారి నిర్వహించి పూర్తి చేసే ప్రక్రియగా కాకుండా.. డిజైన్ దశలో, నిర్మాణ సమయంలో, రహదారి ప్రారంభానికి ముందు, ప్రారంభించిన తర్వాత కూడా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అన్నారు.

అంతర్జాతీయ నమూనాలను పరిశీలించి, కీలక రహదారులు ప్రారంభించే ముందు భద్రతా ప్రమాణాలు పూర్తిగా అమలయ్యాయా లేదా పరిశీలించే విధంగా స్వతంత్ర 'రోడ్డు భద్రత అంబుడ్స్‌మన్' (Road Safety Ombudsman) లేదా భద్రతా ప్రాధికార సంస్థ (Safety Authority) ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించవచ్చని సూచించారు.

భూసేకరణ.. రహదారి భద్రతలో కీలక అంశం

రహదారుల నిర్మాణంలో భూసేకరణ, రైట్ ఆఫ్ వే (Right of Way) అందుబాటులో ఉండటం అత్యంత కీలకమని మంత్రి చెప్పారు. సరైన జంక్షన్లు, తగినంత విజిబిలిటీ, సర్వీస్ రోడ్లు, పాదచారుల సౌకర్యాలు కల్పించాలంటే అవసరమైన మేరకు భూమి అందుబాటులో ఉండాలని అన్నారు.

అనియంత్రిత మీడియన్ ఓపెనింగ్స్, నేరుగా ఇళ్లకు లేదా వాణిజ్య సంస్థలకు ఇచ్చే యాక్సెస్‌లు, సరిగా డిజైన్ చేయని కూడళ్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని తెలిపారు.

పట్టణాలు, గ్రామాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల మీదుగా వెళ్లే హైవేలపై పాదచారుల క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్‌లు, బస్ బేలు, లైటింగ్, సైన్ బోర్డులు, ట్రాఫిక్ కాల్మింగ్ చర్యలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు.

బ్లాక్ స్పాట్ గుర్తించడం కాదు.. శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించడం మాత్రమే పరిష్కారం కాదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. అక్కడ శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రోడ్డు ప్రమాదాలపై నిర్ణయాలు మరింతగా డేటా ఆధారంగా ఉండాలని, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదం సంభవించే అవకాశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

నిర్మాణ నాణ్యత కూడా రోడ్డు భద్రతలో భాగమే

డిజైన్ ఎంత సురక్షితంగా ఉన్నా నిర్మాణ నాణ్యత లోపిస్తే దాని ప్రయోజనం ఉండదని మంత్రి అన్నారు. కాబట్టి క్వాలిటీ అష్యూరెన్స్, సూపర్‌విజన్, రోడ్ మార్కింగ్స్, సైన్ బోర్డులు, క్రాష్ బ్యారియర్లు, డ్రైనేజీ, పేవ్‌మెంట్ నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు.

నిర్మాణం, నిర్వహణ సమయంలో వర్క్‌జోన్ భద్రతకు కూడా మరింత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సరైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌లు, బ్యారికేడింగ్, లైటింగ్, హెచ్చరిక బోర్డులు, సురక్షిత డైవర్షన్‌లు ఏర్పాటు చేయడం ద్వారా కార్మికులు, వాహనదారుల భద్రతను కాపాడాల్సి ఉందన్నారు.

టెక్నాలజీతో ప్రమాదాలను ముందుగానే గుర్తించాలి

ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్, సీసీటీవీ (CCTV) నిఘా, ఇన్సిడెంట్ డిటెక్షన్, స్పీడ్ మానిటరింగ్, జీఐఎస్ (GIS) ఆధారిత సేఫ్టీ మ్యాపింగ్, డ్రోన్లు, డిజిటల్ రోడ్ ఇన్వెంటరీ వంటి సాంకేతికతలను విస్తృతంగా ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు.

డిజైన్‌లో సేఫ్.. నిర్మాణంలో సేఫ్.. ఆపరేషన్‌లో సేఫ్.. రహదారి మొత్తం జీవితకాలంలో సేఫ్ అనే విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు.

2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించాలి

కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నిర్దేశించిన విధంగా 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించే జాతీయ లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని రాష్ట్రాలు కలిసి పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు కూడా సుమోటోగా కేసు స్వీకరించి, రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా రోడ్డు సేఫ్టీ సమావేశాలు నిర్వహించి ప్రమాదాలను విశ్లేషించాలని, బ్లాక్ స్పాట్లను గుర్తించి జిల్లా స్థాయిలో తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

దేశంలో రోడ్డు ప్రమాద మరణాలు ఆందోళనకరం

2023లో దేశవ్యాప్తంగా 1,72,890 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని మంత్రి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 23,652 మంది, తమిళనాడులో 18,347 మంది, మహారాష్ట్రలో 15,366 మంది, మధ్యప్రదేశ్‌లో 13,798 మంది, కర్ణాటకలో 12,321 మంది మరణించారని చెప్పారు.

తెలంగాణలో 2023లో 7,660 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, ఇది దేశవ్యాప్తంగా నమోదైన మరణాల్లో 4.4 శాతంగా ఉందన్నారు. దేశంలోని మొదటి పది రాష్ట్రాల్లోనే దాదాపు 74 శాతం రోడ్డు ప్రమాద మరణాలు నమోదవుతున్నాయని తెలిపారు.

హైదరాబాద్ - విజయవాడ NH - 65 రహదారి పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై ఈ సమావేశంలో మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 17బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మాణం జరుగుతున్నా... ప్రస్తుతం ఉన్న 4 లేన్ రహదారిపై ట్రాఫిక్ లోడ్ విపరీతంగా పెరిగిందన్నారు. 6o2 లేన్ల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రహదారి విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉన్నదని మంత్రి పేర్కొన్నారు. ఈ రహదారి విస్తరణ అంశం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వద్ద ప్రత్యేకంగా ప్రస్తావించామని,త్వరలో కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపి,పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో మేలు చేకూర్చే అంశమని అభివర్ణించారు.

అంతర్జాతీయంగా చూస్తే భారత్‌లో రోడ్డు ప్రమాద మరణాల రేటు కూడా ఆందోళనకరంగా ఉందన్నారు. అమెరికా, యూకే, జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాలు రహదారి డిజైన్, వాహన భద్రత, వేగ నియంత్రణ, కఠినమైన అమలు, పాదచారులు--సైక్లిస్టుల భద్రత, ప్రమాద డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా మరణాలను గణనీయంగా తగ్గించ గలిగాయని తెలిపారు.

చింతన్ శివిర్‌లో రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు.

1. భద్రతను దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేయాలి
2. నిర్మాణంలోనూ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి
3. నిర్వహణలో భద్రతను నిర్ధారించాలి
4. డేటా, సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలి
5. నిరంతరం సమీక్షిస్తూ మెరుగుపరుచుకోవాలి

ఎన్ని కిలోమీటర్లు నిర్మించామన్నది కాదు.. ఎన్ని ప్రాణాలు కాపాడామన్నదే ముఖ్యం

హైవే ప్రాజెక్టు విజయాన్ని కేవలం ఎన్ని కిలోమీటర్ల రహదారి నిర్మించాం, ఎంత ప్రయాణ సమయం తగ్గించాం, ఎంత ట్రాఫిక్ సామర్థ్యం పెంచాం అనే అంశాలతో మాత్రమే కొలవకూడదని మంత్రి అన్నారు. "అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఒక్కటే.. మనం ఎన్ని ప్రాణాలను కాపాడగలిగాం?" అని అన్నారు.

ప్రతి వాహనదారుడు, ప్రయాణికుడు, పాదచారి, సైక్లిస్ట్, ద్విచక్ర వాహనదారుడు, హైవేల వెంట నివసించే స్థానిక ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా రహదారులను నిర్మించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

వేగవంతమైన, సమర్థవంతమైన ప్రయాణంతో పాటు ప్రతి ప్రయాణం సురక్షితంగా ఉండే భవిష్యత్తును నిర్మించేందుకు కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. "ఈ రోజు మనం నిర్మించే ప్రతి కిలోమీటర్ రహదారి.. రాబోయే తరాలకు కూడా సురక్షితంగా ఉండాలి. ప్రమాణాల నుంచి అమలుకు.. అమలు నుంచి మెరుగైన పనితీరుకు మన ప్రయాణం కొనసాగాలి" అని మంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ ఐఏస్ , చీఫ్ ఇంజినీర్ (నేషనల్ హైవేస్) ధర్మారెడ్డి, చీఫ్ ఇంజినీర్ (RRR & CRIF) వసంత్ నాయక్, చీఫ్ ఇంజినీర్ (స్టేట్ రోడ్స్ & HAM) బి. వెంకటేశ్వరరావు,పలువురు అధికారులు పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన సీపీ ఎన్. శ్వేతా,



**హనుమకొండ ప్రజాబలం ప్రతినిధి** వరంగల్ నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఈ నెల 11 వ తేదీ నుండి ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముందస్తు భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఉత్సవాల సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ తరపున చేపడుతున్న చర్యలను సిపి గారు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు మరియు భద్రతా విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, హన్మకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, మట్టెవాడ, ఇంతేజర్ గంజ్, మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్లు, ఆలయ పాలక మండలి, అర్చకులు పాల్గొన్నారు.

### రేణిగుంటలో మద్యం షాపులు తొలగించాలి

### మద్యం షాపులపై సీఎం, ఎక్సైజ్ కమిషనర్‌కు ఐద్వా ఫిర్యాదు

రేణిగుంటలో జనావాసాలు, పాఠశాలలు, ఆలయాలు, బస్టాపులు, ప్రజల రాకపోకలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ×ఆద్య వైన్స్ (షాప్ నెం.53), సర్వేశ్ వైన్స్ (షాప్ నెం.52)×ను తొలగించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం రేణిగుంట పోస్టాఫీసు నుంచి సీఎం నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు "స్పీడ్ పోస్టు" ద్వారా వినతిపత్రాలు పంపించారు. ఇందులో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, మండల అధ్యక్షురాలు భారతి, పద్మావతి పాల్గొన్నారు.మద్యం దుకాణాల వల్ల మహిళలు, బాలికలు, విద్యార్థులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు, భద్రతపై ఆందోళన నెలకొంటోందని ఈశ్వరమ్మ తెలిపారు. సమస్యపై ఇప్పటికే 9 రోజులపాటు వీధి నిరసనలు, ధర్నాలు నిర్వహించడంతో పాటు జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ శాఖ ఎస్పీ, తహసీల్దార్, సీఐ, డీఎస్పీలకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. గతంలో ప్రజల ఆందోళనలతో జనావాసాలకు దూరంగా తరలించిన మద్యం దుకాణాలను తిరిగి జనావాసాల మధ్యకు తీసుకురావడం సరికాదని, ఆద్య, సర్వేశ్ వైన్స్ పై తక్షణ విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, జనావాసాలకు దూరంగా తరలించాలని ఐద్వా ద్వారా డిమాండ్ చేశారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజా స్వామ్యనికి గొడ్డలి పెట్టు .

## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్...



దేశంలో ఓట్ల తొలగింపు, ం.ఊ.తీ ప్రక్రియ లో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తే ఒక లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ తో పాటు ఇండియా కూటమి నాయకులను అరెస్ట్ చేయడం ప్రజా స్వామ్య విధానాలకు గొడ్డలిపెట్టు లాంటిదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

ఈ విషయమై ఆయన మంగళవారం నాడు ఢిల్లీలో.మీడియా తో మాట్లాడారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ప్రజా స్వామ్య యుతంగా, శాంతి యుతంగా ఈ.సి ముందు దీక్ష చేసేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం చాలా దారుణం అని అన్నారు. ఇండియా కూటమి నాయకులు దేశంలో ఒక అతిపెద్ద సమస్యపై పోరాటం చేస్తుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇలా అడ్డుకోవడం నియంత పాలనకు పరాకాష్ట అన్నారు.

దేశంలోని ఇండియా కూటమి ఎంపీలు రాహుల్ గాంధి, ప్రియాంక గాంధీ పాంటీ కాంగ్రెస్ అగ్రనేతలు పాల్గొన్న అంశంలో కేంద్రం ప్రవర్తించిన తీరు చాలా దుర్మార్గమని ఇది ప్రతి ప్రజాస్వామ్య వాది ఖండించాలని అన్నారు. దేశంలో అడ్డగోలుగా ఓట్ల చోరీ చేసి అక్రమంగా అధికారంలోకి వస్తున్న బీజేపీ ఇలా ఇండియా కూటమి నేతలను అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు

# లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీల అరెస్ట్ అప్రజాస్వామికం

**ఎన్నికల సంఘం స్వతంత్రత పై దేశ భవిష్యత్తు అయిన యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీ గారిని,ముఖ్య నాయకులను అరెస్ట్ చేయడం హేయనీయం**

**ూౌx= తో ఓట్ చోరీ చేస్తున్నారని రాహుల్ గాంధీ గారు మొదటి నుండి ప్రశ్నిస్తున్నారు**

**బీజేపీ కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం పనిచేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు**

**- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



హైదరాబాద్:లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీలతో పాటు ఇండియా కూటమి అగ్రనాయకుల అరెస్ట్‌ను రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని, ప్రియాంక గాంధీని మరియు ఇతర కీలక నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అత్యంత హేయమైన చర్య అని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును హరించడం బీజేపీ అహంకారపూరిత పాలనకు నిదర్శనమని మండిపడ్డారు.

దేశ భవిష్యత్తు అయిన యువత ఈనాడు కేంద్ర ఎన్నికల సంఘం పనిచేస్తున్న తీరుపై, దాని స్వతంత్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు.

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత లోపించిందని, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తుంటే, దానికి సమాధానం చెప్పలేక అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ఎస్ఐఆర్ (SIR) పేరుతో దేశంలో జరుగుతున్న 'ఓట్ చోరీ' పై రాహుల్ గాంధీ మొదటి నుంచీ గళం విప్పుతూనే ఉన్నారని, ప్రజల తీర్పును తారుమారు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాల్సింది పోయి, కేవలం బీజేపీ కనుసన్నల్లో, వారి అజెండా ప్రకారమే పనిచేస్తుండటం భారత ప్రజాస్వామ్యానికి తీవ్రమైన గొడ్డలిపెట్టు లాంటిదని హెచ్చరించారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ఎన్ని కుట్రలు చేసినా, నిరంకుశ అరెస్టులకు పాల్పడినా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమి పోరాటం ఆగేది లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# రెండో స్వాతంత్ర్య పోరాటం చేస్తున్నాం

**- ఓటు హక్కు తొలగించడం దేశద్రోహంతో సమానం**

**- బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నోళ్ల ఓట్లే టార్గెట్ చేస్తున్నారు**

**- పేదలు, బడుగు, బలహీన వర్గాల ఓట్లు తొలగించే కుట్ర**

**- 13 కోట్ల ఓట్ల తొలగింపంటే ఆషామాషీ విషయం కాదు**

**- సుప్రీం ఆమోదంతోనే ఫామ్-6లో మార్పులు చేశాన్నారు**

**- కానీ, ఈసీ చెప్పేవన్నీ అబద్ధాలేనని తేలిపోయింది**

**- ఓటు హక్కు కోసం పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలి**

**- మీడియా సమావేశంలో**

**తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవి**



న్యూఢిల్లీ, అక్టోబర్ 6 : దేశంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన కోట్ల కొద్దీ పౌరుల ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కుట్రపూరితంగా తొలగిస్తున్నాయని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవి తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ అన్యాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి ఆధ్వర్యంలో పార్లమెంట్ మకర ద్వారం నుంచి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) కార్యాలయం వరకు భారీ ప్రొటెస్ట్ ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు.

"ఈరోజు పార్లమెంట్ మకర ద్వారం దగ్గర నుంచి బయలుదేరి ప్రొటెస్ట్ ర్యాలీ కాంగ్రెస్ పార్టీ, ఇండియా అలయన్స్ పార్టీలు ఎస్పీ, ఎన్సీపీ, ఆర్జేడీ, సీపీఎం, సీపీఐ ఇంకా కొన్ని రాష్ట్రాల్లో ఉన్న టీఎంసీ అందరం ఎంపీలు పార్లమెంట్ నుంచి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆఫీస్ వరకు పాదయాత్రలు, ఎలక్ట్రోరల్ ర్యాలీగా వెళ్ళడం జరిగింది. ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కలిగించాల్సిన బాధ్యత ఈసీపై ఉంది" అని ఆయన తెలిపారు.

**- 13 కోట్ల ఓట్ల తొలగింపంటే ఆషామాషీ కాదు...**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరు మీద ఇప్పటివరకు భారతదేశంలో 13 కోట్ల మంది పౌరుల ఓటు హక్కును ఓటర్ల జాబితా నుంచి తొలగించారని మల్లు రవి తెలిపారు. దేశంలో ఏకంగా 13 కోట్ల ఓట్ల తొలగింపు అంటే అషామాషీ విషయం కాదన్నారు. 13 కోట్ల ఓట్లు అంటే ప్రపంచంలో కొన్ని దేశాల మొత్తం జనాభా కంటే ఎక్కువని అన్నారు. పది, పదిహేను దేశాల ప్రజల సమూహానికి ఓట్లు లేకుండా చేసినంత మందికి ఓట్లు తొలగించారని మండిపడ్డారు.

**- బడుగు, బలహీన వర్గాల ఓట్లు తొలగించే కుట్ర..**

ఎస్ఐఆర్ పేరుతో దేశంలోని బడుగు, బలహీన వర్గాల ఓట్లు తొలగించే కుట్ర జరిగిందని ఎంపీ మల్లు రవి ఆరోపించారు. ఫామ్ 6 లో ఇంతకుముందు ఉన్న ప్రణాళికలు కాకుండా ఉద్దేశ పూర్వకంగానే కొత్తమార్పులు తీసుకొచ్చారని తెలిపారు. మీ పేరుందా, మీ తల్లిదండ్రుల పేరుందా, మీ తాత ముత్తాతల పేరుందా అంటూ ఒక డజన్ సర్టిఫికెట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. దీనివల్ల బలహీన వర్గాలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, ఆర్థికంగా వెనుకబడ్డ వాళ్ళ ఓట్లు అన్నీ తీసేయడం జరిగిందని పేర్కొన్నారు.

" ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డ వాళు ్ళ పనికొరకు అనేక ప్రాంతాలు తిరుగుతుంటారు, మైగ్రేషన్ జరుగుతుంటది. వాళ్లకు సరైన టైంలో నోటీస్ అందకపోవటం, అందిన వాళ్లకు టైం ఇవ్వకపోవటం వల్ల ఓట్లు తీసేస్తున్నారు. తెలంగాణలో ఈ ఇన్ఫర్మేషన్ ఇవ్వడానికి టైం పొడిగించమంటే వీలేదని నిర్ణయం తీసుకున్నారు. మహారాష్ట్ర, హర్యానా, బీహార్, అస్సాం, వెస్ట్ బెంగాల్ లో కూడా ఇదే రకంగా చేశారు" అని మల్లు రవి వివరించారు.

**- బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నోళ్ల ఓట్లే టార్గెట్...**

దేశంలో బీజేపీకి, బీజేపీ భావజాలానికి వ్యతిరేకంగా ఉన్న వాళ్ల ఓట్లన్నీ టార్గెట్ చేసేలా ఎస్ఆర్ఐ ప్రక్రియ సాగిందని ఎంపీ మల్లు రవి ఆరోపించారు. గ్రామ స్థాయిలో బిఆర్ఓ, బిఎల్ఓ లు గ్యాదర్ చేసిన ఇన్ఫర్మేషన్ అంతా ఏఆర్ఓ దగ్గర ఏమి నిర్ణయం తీసుకోకుండానే, మొత్తం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా దగ్గరికి చేరేలా ప్రణాళిక రచించారని అన్నారు. ఆ తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సోషల్ మీడియాలో వాళ్ళు ఏ పార్టీకి ఓటేశారో తెలుసుకొని, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న వాళ్ళందరినీ తీసేయడం వల్ల 13 కోట్ల మంది ఓట్లు కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు.

**- ఓటు హక్కు తొలగించడం దేశద్రోహంతో సమానం..**

ఒక వ్యక్తి ఓటు హక్కును అన్యాయంగా, అతని ప్రమేయం లేకుండా తొలగించడం అంటే దేశద్రోహంతో సమానమని మల్లు రవి మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కే పునాదని తెలిపారు. ఓటు హక్కు లేకపోతే ప్రజాస్వామ్యం లేదని, ప్రభుత్వాలు లేవని చెప్పారు. ప్రతి పౌరుడుకీ ఒకే ఓటు - ఒకే విలువ అని తెలిపారు. అంతటి విలువైన ఓటు హక్కుని అన్యాయం తీసేస్తున్నారు అంటే ఇది దేశద్రోహం లాంటిదేనని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎంతో చర్చించి అందరికీ సమాన ఓటు హక్కును ఇచ్చారని గుర్తు చేశారు. అమెరికాలో కూడా రాజ్యాంగం వచ్చిన వెంటనే మహిళలకు ఓటు హక్కు ఇవ్వలేదని తెలిపారు. కొన్ని ఏళ్ల తర్వాత అక్కడ మహిళలకు ఓటు హక్కు కల్పించారని అన్నారు. కానీ, మనదేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత మహిళలు, ఎస్సీ, ఎస్టీలు, బడుగు, బలహీన వర్గాలు అందరికీ ఓటు హక్కు కల్పించారని స్పష్టం చేశారు. ఆ ఓటు హక్కును ఇప్పుడు అక్రమంగా తీసెయ్యడం ద్వారా మళ్లీ రాచరిక పాలనను తీసుకురావాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం పేరు చెబుతూనే లోలోపల మాత్రం రాజుల్లా పరిపాలించాలని చూస్తోందని మండిపడ్డారు.

**- ఫామ్ 6లో మార్పులకు తాము అనుమతించలేదని సుప్రీం చెప్పంది..**

సుప్రీంకోర్టు ఆమోదంతోనే ఫామ్-6లో చేర్పులు, మార్పులు చేశామని కేంద్ర ఎన్నికల కమిషన్ చెప్పిందని, కానీ అదంతా అబద్ధమేనని తేలిపోయిందని ఎంపీ మల్లు రవి తెలిపారు.

"నిన్నటి వరకు ఫామ్ 6 మార్పులు సుప్రీంకోర్టు అప్రూవల్ తోనే జరిగాయని ఎన్నికల కమిషన్ చెప్పింది. కానీ, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ మాత్రం ఫామ్- 6 మార్పులకు సుప్రీంకోర్టు ఆమోదం లేదని కేటాగారికల్ గా చెప్పారు. ఎవరు ఈ మార్పులు చేయమన్నారో వివరాలు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఎన్నికల కమిషన్ అబద్ధాలు చెబుతోంది, ప్రస్తుత ప్రభుత్వం ఈసీకి మద్దతు ఇస్తోంది" అని ఆయన వెల్లడించారు.

**- రాహుల్ నేతృత్వంలో రెండో స్వాతంత్ర్య పోరాటం...**

ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నేతృత్వంలో రెండో స్వాతంత్ర్య పోరాటం సాగుతోందని ఎంపీ మల్లు రవి తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, పటేల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎలా పోరాడిందో, ఇప్పుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా అలయన్స్ తో కలిసి దేశంలో రెండో స్వాతంత్ర్య పోరాటం చేస్తున్నామని అన్నారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవడానికి పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# బార్ల యజమానులకు నష్టం లేదు.. వినియోగదారులపై స్వల్ప భారం: మంత్రి జూపల్లి

**ప్రివిలేజ్ ఫీజుతో బార్ల యజమానులకు నష్టం లేదన్న మంత్రి జూపల్లి**

**వినియోగదారులపై పడేది స్వల్ప భారమేనని స్పష్టీకరణ**

**బీఆర్ఎస్ హయాంలో మద్యం ఆదాయం 260 శాతం పెరిగిందని వెల్లడి**

రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్ల యజమానులకు ఎలాంటి నష్టం జరగదని, వినియోగదారులపై మాత్రమే స్వల్ప భారం పడుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలపై ఆయన స్పందించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మద్యం ధరలు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందే తప్ప, వినియోగం పెద్దగా తగ్గదని గత అనుభవాలు చెబుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరం అప్‌గ్రేడ్ అయినందున, ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగానే ఇక్కడా బార్ లైసెన్సులను జారీ చేశామని తెలిపారు. ఈ కొత్త రుసుము బార్ యాజమాన్యాలకు నష్టం కలిగించేది కాదని ఆయన పునరుద్ఘాటించారు.



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయం రూ.10,000 కోట్ల నుంచి రూ.36,000 కోట్లకు, అంటే దాదాపు 260 శాతం పెరిగిందని జూపల్లి గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం ఆదాయం ప్రస్తుతం రూ.40,000 కోట్లుగా ఉందని వివరించారు. ప్రభుత్వం చట్ట ప్రకారమే ముందుకు వెళుతోందని, మద్యం ఉత్పత్తికి నీటి కొరత ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నిరసన..

## పాల్గొన్న ప్రొ.కోదండరాం



ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటు హక్కు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, సమాజ్‌వాదీ జనతా పార్టీ, ఆర్ఎస్‌పీ, ఎస్‌యూసీఐ తదితర పార్టీల నాయకులు రోడ్డుపై బైఠాయించి సుమారు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం గారు హాజరై మాట్లాడుతూ, ఎస్ఐఆర్ పేరుతో ప్రజాస్వామ్యానికి, ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. ఫామ్-7 పేరుతో బీజేపీ కార్యకర్తలు అక్రమాలకు పాల్పడుతూ, బీజేపీ వ్యతిరేక ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, దానిని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని అన్నారు.నిరసన అనంతరం అఖిలపక్ష నాయకులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## మంగపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీతక్క చొరవతో అధికారుల పరిశీలన



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 06** మంగపేటమంగపేట మండల కేంద్రంలోని కప్పవాగు చెక్‌డ్యాం,ముసలమ్మ తోగు ప్రాంతాల్లో ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ ధర్మ గారి ఆధ్వర్యంలో అధికారుల పరిశీలన

రైతుల సౌకర్యం,ముంపు నివారణకు అవసరమైన చర్యలపై పరిశీలన

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క గారి ఆదేశాల మేరకు,ఇరిగేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈరోజు రాజుపేట కేంద్రంలోని చీపురుదుబ్బ గ్రామంలో ఉన్న కప్పవాగు చెక్‌డ్యాంను అధికారులు పరిశీలించారు.రైతులకు ఉపయోగకరంగా ఉండేలా చెక్‌డ్యాం వద్ద అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి,వాటికి సంబంధించిన అంచనాలు,విధివిధానాలను పరిశీలించారు.

అలాగే రాజుపేట గ్రామంలో ముసలమ్మ తోగు కారణంగా ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించి,ముంపు నివారణకు అవసరమైన ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం కోసం అంచనాలు,సాంకేతిక విధివిధానాలను ఖరారు చేసే ప్రక్రియను చేపట్టారు.

ఈ పరిశీలనలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మోహన్‌రావు,సీ.ఎన్.శంకరయ్య,డీఈ కే.వేణుగోపాల్‌రావు,ఏఈ శనేశ్కర్,శేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఈ అధికారుల పరిశీలన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లుతో పాటు జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వల్లెపల్లి శివప్రసాద్,జిల్లా లీగల్ సెల్ చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి,ఏటూరునాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,మండల కిసాన్ సెల్ అధ్యక్షులు చౌలం వెంకటేశ్వర్లు,సీనియర్ నాయకులు తుమ్మల ముఖర్జీ,బెనర్జీ,తుంబూరి రామ్‌రెడ్డి, యాలం రమేష్,వీర్ల రఘురామ్,గ్రామస్తులు మంకిడి నాగేశ్వరరావు,తాటి శ్రీను,ఇర్ప సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ యువతకు విదేశీ కొలువుల అవకాశం

### టామ్‌కామ్ ద్వారా పలు దేశాల్లో ఉద్యోగావకాశాలు

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధి అధికారి రాధిక

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబర్ 6:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని లిటామ్‌కామ్ (Telangana Overseas Manpower Company)లి ద్వారా విదేశాల్లో వివిధ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ సహకారంతో జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా, పూర్తిగా ప్రభుత్వ పర్యవేక్షణలో ఈ-మైగ్రేట్ విధానం ద్వారా నియామకాలు జరుగుతాయని తెలిపారు.

జర్మనీలో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అభ్యర్థులకు నర్సుల ఉద్యోగాలు, నెలకు సుమారు యూరో 2,800 (రూ.3.09 లక్షలు)వేతనం లభించనుంది. అలాగే హెల్త్, నాన్-హెల్త్ విభాగాల్లో Ausbildung ద్వారా యూరో 2,800 నుంచి 3,300 వరకు వేతనంతో ఉద్యోగ అవకాశాలున్నాయి. ఇందుకు 18--28 ఏళ్ల వయసు వారు అర్హులు.

ఇజ్రాయెల్‌లో హోమ్ కేర్ గివర్ ఉద్యోగాలకు లిలినెలకు రూ.1.99 లక్షలకుపైగా వేతనం లభించనుండగా, ఏ ఎన్ ఎం, జి ఎన్ ఎం, బీఎస్సీ నర్సింగ్ అర్హతలు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆస్ట్రియా, ఐర్లాండ్, స్పెయిన్, మాల్టా తదితర దేశాల్లో రిజిస్టర్డ్ నర్సుల ఉద్యోగాలకు రూ.1.21 లక్షల నుంచి రూ.3.40 లక్షల వరకు వేతన అవకాశాలున్నాయి. బీఎస్సీ/జీఎన్ఎం అర్హతతో పాటు రెండేళ్ల అనుభవం అవసరం.

దుబాయ్‌లో క్యాబ్ డ్రైవర్లు, ఈ-బైక్ రైడర్లు, మెషిన్ ఆపరేటర్లు, కౌంటర్, హెల్పర్ తదితర ఉద్యోగాలకు ఏ ఇ డి 1,200 నుంచి 6,000 (సుమారు రూ.31 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు) వేతనాలు లభించనున్నాయి. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, 10o2తో పాటు అనుభవం ఉన్నవారు అర్హులు.

అమెరికా, ఆస్ట్రేలియా, మలేషియా, జపాన్ దేశాల్లో స్పా నర్సులు, ఎలక్ట్రీషియన్లు, వెల్డర్లు, అగ్రికల్చర్ వర్కర్లు తదితర ఉద్యోగాలకు ఏటా 70,000 నుంచి 95,000 డాలర్ల వరకు వేతన అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. సంబంధిత అర్హతతో పాటు అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు పైసా ఖర్చు లేకుండా నమోదు చేసుకోవచ్చని, ఎంపిక ప్రక్రియ పూర్తిగా టామ్‌కామ్, జిల్లా ఉపాధి కార్యాలయం పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

మరిన్ని వివరాలకు:

ఫోన్: 9866465024, 7842617596 ఈ నంబర్ లలో సంప్రదించాలి అని తెలిపారు.

## విద్యా రంగంలో హంసినీ హైస్కూల్ మరో ముందడుగు

### ఐఐటీ.. నీట్.. సివిల్స్‌కు చిన్ననాటి నుంచే ఫౌండేషన్

### ఫౌండేషన్ పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి (అక్టోబర్ - 6 )** విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా వినూత్న విద్యా విధానాలకు శ్రీకారం చుడుతూ వేములవాడ పట్టణంలోని హంసినీ హైస్కూల్ విద్యా రంగంలో మరో కీలక ముందడుగు వేసింది. ఐఐటీ, నీట్, సివిల్స్ వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలకు విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే సన్నద్ధం చేసే ఉద్దేశంతో ప్రత్యేక ఫౌండేషన్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది.




ఈ కార్యక్రమంలో భాగంగా హంసినీ హైస్కూల్ కరస్పాండెంట్ నరాల సంతోష్ రూపొందించిన ఐఐటీ, నీట్, సివిల్స్ ఫౌండేషన్ పుస్తకాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ విజయాలకు పాఠశాల స్థాయిలోనే బలమైన పునాది అవసరమని అన్నారు. చిన్ననాటి నుంచే పోటీ పరీక్షలపై అవగాహన కల్పించడం, విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించడం ద్వారా వారు భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.వేములవాడలో విద్యార్థులకు ఐఐటీ, నీట్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు ముందస్తు ఫౌండేషన్ అందించే దిశగా హంసినీ హైస్కూల్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి సరైన దిశానిర్దేశం చేయడం ద్వారా ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చని సూచించారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది

హంసినీ హైస్కూల్ కరస్పాండెంట్ నరాల సంతోష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, భవిష్యత్ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఐఐటీ, నీట్, సివిల్స్ వంటి పరీక్షలకు అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానం, తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను చిన్ననాటి నుంచే అభివృద్ధి చేసే విధంగా ఫౌండేషన్ విద్యను రూపొందించినట్లు తెలిపారు.

ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య, మార్గదర్శకత్వం అందించడమే హంసినీ హైస్కూల్ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.

విద్యార్థులకు ఆధునిక విద్యా విధానాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పోటీ పరీక్షలకు అవసరమైన పునాది అంశాలను పాఠశాల స్థాయిలోనే బోధించేందుకు హంసినీ హైస్కూల్ చేపట్టిన ఈ కార్యక్రమం వేములవాడ విద్యా రంగంలో ప్రత్యేకంగా నిలుస్తోంది. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలనే లక్ష్యంతో పాఠశాల యాజమాన్యం ముందుకు సాగుతోంది.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, డైరెక్టర్ సన్నిధి వెంకటకృష్ణ, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ఉద్యోగాల అభ్యర్థులకు రెసిడెన్షియల్ సదుపాయం

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 06 ములుగు** ములుగు జిల్లాలోని పలు మండలాల ఉద్యోగం కోసం వేచి ఉన్న నిరుద్యోగ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసింది దీనిలో సబ్-ఇన్‌స్పెక్టర్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ , వరంగల్ ఉమ్మడి జిల్లా బ్రాంచ్ లో ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ...



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో జారీ చేసిన సబ్-ఇన్‌స్పెక్టర్ మరియు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి, వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అర్హులైన ఎస్సీ ఎస్టి, బిసి మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులకు ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ వరకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి

డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు.

అభ్యర్థుల ఎంపిక: స్టడీ సర్కిల్ నిబంధనలు, రిజర్వేషన్ రోస్టర్/రిజర్వేషన్ నిష్పత్తి మరియు డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుంది అని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ములుగు జిల్లా అధికారి కొమురయ్య ,ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకులు డాక్టర్ కె జగన్ మోహన్ అన్నారు దరఖాస్తుతో సమర్పించవలసిన పత్రాలు

ఎస్సై పిసి పోస్టులకు దరఖాస్తు చేసిన అప్లికేషన్ / అక్‌నాలెడ్జ్‌మెంట్ ఫారం

ఎస్ ఎస్ సి ,ఇంటర్మీడియట్

డిగ్రీ సర్టిఫికేట్ టీసీ కులశీ ఆదాయశీ

రెసిడెన్షియల్ ఆధార్ కార్డు

అవసరమైన ఇతర ధ్రువీకరణ పత్రాలు అభ్యర్థులు తమ దరఖాస్తులను మరియు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్, ఆర్టీసీ కాలనీ, వడ్డేపల్లి, హనుమకొండ నందు సమర్పించాలి.

దరఖాస్తుల స్వీకరణకు తేదీ: 06-10-2026 నుండి దరఖాస్తుల పరిశీలన సమర్పణకు చివరి తేదీ 10-10-2026 సాయంత్రం 5:00 గంటల వరకు సమర్పించాలి.

మరిన్ని వివరాల కోసం స్టడీ సర్కిల్ 9160606862 సంప్రదించగలరు.

## ఎన్నికల విధులను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించాలి

### సి డి.ఎం.ఏ. సంపత్ కుమార్.

తిరుపతి నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల విధులను నిబద్దతతో, సమర్థవంతంగా నిర్వహించాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. ఎన్నికల విధులపై మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల విభజన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు తదితర విషయాలను కమిషనర్ ఎం.జయకృష్ణ పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 50 వార్డులను 66 వార్డులుగా పెంచుతూ విభజన చేశామని, 304 పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రజల నుండి అభ్యంతరాలను స్వీకరించడం జరిగింది. మొత్తం 290492 ఓటర్లు ఉండగా అందులో మహిళలు 1,47,171, పురుషులు 1,43,292, ఇతరులు 29 మంది ఉన్నారని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు ఆర్.ఓ లు, ఏఆర్ఓ లను నియమించామని తెలిపారు. అలాగే ఎస్.వి. ఆర్ట్స్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సి.డి.ఎం.ఏ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమైనదని తెలిపారు. ఎవరెవరికి కేటాయించిన విధులను వారు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వహించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ చక్కగా పనిచేయాలని తెలిపారు. అందరూ నిష్పక్షపాతంగా విజయవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు మ్యాప్ సిద్ధం చేయాలని తెలిపారు. ఏ రోజుకారోజు మీ విధులను చక్కగా నిర్వహించాలని తెలిపారు. విధుల్లో ఎవరు పొరపాటు చేసినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకమునుపు ఎస్.వి.ఆర్ట్స్ కాలేజీ లోని స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించారు.

## ములుగు జిల్లా వైద్యాధికారులకు ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మె నోటీసు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 06 ములుగు** తెలంగాణ రాష్ట్రంలో వివిధ క్యాడర్ లలో పని చేస్తున్నటువంటి ఎన్ హెచ్ ఎం 17వేల మంది ఉద్యోగులు సమ్మెకు నోటీసులు జిల్లా అధికారులకు అందజేశారు ఉద్యోగుల డిమాండ్ చాలా సంవత్సరాల నుంచి జాతీయ హెల్త్ మిషన్ పని చేస్తున్నటువంటి వివిధ క్యాడర్ల ఉద్యోగులు రాత్రి పగలు రోగులకు సేవలు అందించి కరోనా మహమ్మారి సమయాలలో తమ జీవితాలను పణంగా పెట్టి వైద్యం అందించిన ఉద్యోగులకు ప్రభుత్వాల నుంచి నిరాశే ఎదురైంది చాలా సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం గడుపుతున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ఈ ప్రభుత్వాల నుంచి ఎలాంటి లాభాలు లేకపోవడంతో వీరికి వచ్చే బెనిఫిట్స్ ఈ ప్రభుత్వాలు నిలిపివేయడం ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని ఆలోచనతో ఈ నెల 13 నుంచి సమ్మె నిరావాదిక దీక్షలు చేయడంతో పాటు విధులకు హాజరు కాకుండా అత్యవసర సేవలకు మాత్రమే హాజరవుతూ తమ సమస్యలు పరిష్కరించుకునే దిశగా ముందడుగు వేస్తున్నారు ప్రభుత్వం వెంటనే ఎన్ హెచ్ఎం లో చాలా సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులకు ప్రభుత్వము నుంచి అందే బెనిఫిట్స్ అన్ని ఏర్పాటు చేయాలని ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు

# ఘనంగా మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు










**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 6** మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమీర్ పేట లోని సత్యం థియేటర్ సర్కిల్ లో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన వారిని ఆయన అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు నామన సంతోష్ కుమార్, దాడి ప్రవీణ్ రెడ్డి, అశోక్ యాదవ్, గుడిగే శ్రీనివాస్ యాదవ్, టిల్లు బాయ్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, పీయూష్ గుప్త, మాసాని రాజా, సత్యనారాయణ, సుమిత్ సింగ్, సాయి, గులాబ్ సింగ్, ఉత్తమ్ సింగ్, బాసా లక్ష్మీ, దుర్గ, రాణి కౌర్ తదితరులు పాల్గొన్నారు.

***సనత్ నగర్ డివిజన్ లో..***

మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను సనత్ నగర్ లోని స్వామి టాకీస్ వద్ద డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, ఆధ్వర్యంలో, బస్టాండ్ వద్ద ఖలీల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం పండ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా స్వామి టాకీస్ వద్ద అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, రాజేష్ ముదిరాజ్, కొలన్ భూపాల్ రెడ్డి, ఆకుల రాజు, శేఖర్, సమి ఉల్లా, జమీర్, ఇబ్రహీం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్



**హైదరాబాద్.. (ప్రజాబలం ప్రతినిధి నరేష**తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రితలసాని శ్రీనివాస్ యాదవ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్. ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు బీసీలు అందరమేకమై బీసీలకు రాజ్యాధికారం వచ్చే విధంగా మీ సహాయ సహకారాలు ఉండాలని అన్నారు. వారు సానుకూలంగా స్పందిస్తూ కచ్చితంగా బహుజనులకు ఓబీసీలకు అండగా నిలబడతాననీ, ఏ కష్టం వచ్చినా నేను అండగా ఉంటానని మాజీ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అన్ని బీసీ కుల సంఘాల తరఫున వారికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బేరి రామచందర్ యాదవ్.

## మంత్రి సీతక్క ములుగు జిల్లా అభివృద్ధి లో భాగంగా రాజుపేటకు మహర్దశ.. రామచంద్రునిపేటలో రూ.3.27 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

### మంత్రి సీతక్క చొరవతో నిధుల మంజూరు -- స్థల పరిశీలన చేసిన రెవెన్యూ అధికారులు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్06 మంగపేట**మంగపేట మండల కేంద్రంలోని రామచంద్రునిపేట గ్రామంలో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 కోట్ల 27 లక్షల నిధులను మంజూరు చేసింది.తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క గారి ప్రత్యేక చొరవతో ఈ సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరు కావడంతో రాజుపేట పరిసర ప్రాంతాల ప్రజల విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.



సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించేందుకు రామచంద్రునిపేట గ్రామంలో స్థానిక తహసీల్దార్ తోట రవీందర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన చేపట్టారు.రెవెన్యూ సర్వేయర్ సఫియా స్థలాన్ని సర్వే చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య,రామచంద్రునిపేట గ్రామ మాజీ ఉపసర్పంచ్ వెంగల బుచ్చిరెడ్డి,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు చౌలం వెంకటేశ్వర్లు,సీనియర్ నాయకులు తుంబూరి రామ్‌రెడ్డి,గోనె శ్రీనివాస్‌రెడ్డి,యానాల రాధాకృష్ణరెడ్డి,అకుతోట వెంకన్న,సున్నం సమ్మయ్య,శ్యామ్ నరేశ్‌రెడ్డి,ఏలేటి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన సబ్‌స్టేషన్ నిర్మాణంతో రాజుపేట కేంద్రంగా రామచంద్రునిపేటతో పాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడి, లో-వోల్టేజ్, విద్యుత్ అంతరాయాల సమస్యలు తగ్గనున్నాయని నాయకులు తెలిపారు.ఏజెన్సీ ప్రాంత ప్రజల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరు చేయించిన మంత్రి సీతక్కకు స్థానిక ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏ యు పి ఎస్ బయ్యక్క పేట పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 06 తాడ్వాయి**తాడ్వాయి మండలంలోని బయ్యక్కపేటలోని గిరిజన సంక్షేమ ప్రాథమికోన్నత పాఠశాల (ఏ యు పి ఎస్ ను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి పాఠశాలలోని విద్యా పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల నోట్‌బుక్స్, అభ్యసన స్థాయి, విద్యా ప్రగతిని పరిశీలించి, పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అలాగే పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, డార్మిటరీ తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పాఠశాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు తరగతి బోధన, విద్యార్థుల అభ్యసన ప్రగతి, హాజరు మరియు పాఠశాల నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలని పీఓ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

## 9వ పోషణ మాసం కార్యక్రమము ఐ సీ డి యస్ జోగిపేట వారి ఆధ్వర్యంలో



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 06 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**ఈ రోజు మంగళవారం 9వ పోషణ మాసం కార్యక్రమం (ఐసీడియస్)జోగిపేట, వారి ఆధ్వర్యంలో 16 వ
వార్డు స్థానిక అవుసలి సంఘంలో ఏర్పాటు చేసుకోవడం, గర్భిణీ స్త్రీలు కిషోర్ బాలికలు, తీసుకోవాల్సిన పోషకాహారం, పరిశుభ్రత గురించి, విపులంగా వివరించారు, ఇట్టి కార్యక్రమమునకు గౌరవ అందోల్–జోగిపేట, మున్సిపల్ చైర్మన్ శ్రీకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ ( చిట్టి బాబు ) స్థానిక 16వ వార్డు కౌన్సిలర్ శ్రీ పట్టిళ్ల శ్రీనివాస్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి, శ్రీమతి లలిత కుమారి,(ఐసిడిఎస్ సిడిపిఓ ) మధులత, (మెప్మా టీఎంసీ ) బిక్షపతి గౌడ్, ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి టీచర్లు మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు..

# 35 మంది లెక్చరర్లు గల్లంతైతే... విద్యార్థుల భవిష్యత్తు ఎవరి చేతుల్లో?

## -ఇంటర్ విద్యలో నాణ్యతపై ఆందోళనలు.. ఖాళీల భర్తీ, పర్యవేక్షణపై ప్రశ్నలు

(ప్రతాప్)

తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనా వ్యవస్థను కుదిపేసే అంశం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కేటాయించిన 35 మంది లెక్చరర్ల ఆచూకీ అధికార యంత్రాంగానికే స్పష్టంగా లేకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పాఠశాల విద్యతో పోలిస్తే ఇంటర్మీడియట్ దశ విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే అత్యంత కీలక దశ. అలాంటి సమయంలో తరగతి గదుల్లో ఉండాల్సిన అధ్యాపకులు ఎక్కడ పనిచేస్తున్నారో, విధుల్లో ఉన్నారో లేదో తెలియని పరిస్థితి నెలకొనడం విద్యా వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేస్తోంది.

వార్తల ప్రకారం, రాష్ట్ర విభజన అనంతరం వివిధ జిల్లాలు, కళాశాలలకు కేటాయించిన కొందరు లెక్చరర్లకు సంబంధించి స్పష్టమైన సమాచారం అందుబాటులో లేదని తెలుస్తోంది. వీరిలో కొందరు తమకు కేటాయించిన విద్యాసంస్థల్లో పనిచేయకపోయినా, జీతాలు పొందుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటర్ బోర్డు అధికారులు విచారణ ప్రారంభించడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఇంత కాలం ఈ పరిస్థితి ఎలా కొనసాగిందన్న ప్రశ్నకు సమాధానం అవసరం.

ఇక్కడ అసలు సమస్య కేవలం 35 మంది లెక్చరర్లదే కాదు. ఒక లెక్చరర్ ఖాళీగా ఉంటే వందలాది మంది విద్యార్థుల బోధన దెబ్బతింటుంది. ముఖ్యంగా గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, వాణిజ్యం వంటి ప్రధాన సబ్జెక్టుల్లో బోధనా లోపాలు విద్యార్థుల ఉన్నత విద్య అవకాశాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. పోటీ పరీక్షలు రోజురోజుకూ కఠినమవుతున్న సమయంలో సరైన బోధన అందకపోతే ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మరింత వెనుకబడే ప్రమాదం ఉంది.

ప్రభుత్వాలు విద్యపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ, విద్యా సంస్థల్లో మానవ వనరుల నిర్వహణలో లోపాలు కొనసాగితే ఆ పెట్టుబడి లక్ష్యం నెరవేరదు. హాజరు వ్యవస్థ, బయోమెట్రిక్ పర్యవేక్షణ, సిబ్బంది డిజిటల్ ట్రాకింగ్, క్రమానుగత తనిఖీలు వంటి వ్యవస్థలు పటిష్ఠంగా అమలైతే ఇలాంటి పరిస్థితులకు ఆస్కారం ఉండదు. విద్యార్థుల హక్కులకు సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యానికి చోటు ఉండకూడదు.

ఒక తరగతి గదిలో ఉపాధ్యాయుడు లేకపోవడం కేవలం పరిపాలనా లోపం కాదు. అది ఒక విద్యార్థి కలను, ఒక కుటుంబం ఆశను, ఒక సమాజ భవిష్యత్తును ప్రభావితం చేసే విషయం. అందుకే ఈ ఘటనను ఒక సాధారణ పరిపాలనా సమస్యగా కాకుండా, విద్యా నాణ్యతకు సంబంధించిన హెచ్చరికగా ప్రభుత్వం, విద్యాశాఖ చూడాలి. ఖాళీల భర్తీ, పారదర్శక పర్యవేక్షణ, జవాబుదారీతనం బలోపేతం అయినప్పుడే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుంది. విద్యార్థుల సంక్షేమం కాగితాలపై కాదు, తరగతి గదుల్లో కనిపించాలి.




యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరియు ఇండియా కూటమి నేతలంతా కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు.

# విశ్వంలో విలీనం, వెస్సో ట్రస్ట్ ల సేవా కార్యక్రమం

హైద్రాబాద్ అక్టోబర్ 6:యాదాద్రి-భువనగిరి జిల్లా లక్కారం గ్రామవాసి మొగులోజు పాండురంగ చారి (65) సెప్టెంబర్ 29న మరణించారు. ఆయన అంత్యక్రియల కార్యక్రమం అక్టోబర్ 9న జరుగనుంది.

ఆయన కుమారుడు నాగరాజు వృత్తి కర్ర పని. తండ్రి వైద్య చికిత్స కోసం ఇన్నాళ్లుగా పెద్ద మొత్తంలో ఖర్చు చేయడంతో, ప్రస్తుతం ఆయన కుటుంబం అంతిమ సంస్కారాల నిర్వహణకు అవసరమైన ఖర్చులను భరించలేని ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది.

నాగరాజు తన ఆప్త బంధువు చిట్రోజు మురళీకృష్ణ ద్వారా తమను కోరగా విశ్వంలో విలీనం సేవ ట్రస్ట్ మరియు వెస్సో ట్రస్ట్ లు సంయుక్తంగా పది వేల రూపాయిల ఆర్థిక సహాయం అందజేసినట్లు విశ్వంలో విలీనం వ్యవస్థాపక అధ్యక్షులు పెంట శ్రీనివాస ఆచార్య తెలిపారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ అంత్యక్రియల వంటి పుణ్య కార్యాలకు మద్దతు ఇస్తున్న గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# తెలంగాణ రైతు సంక్షేమ సేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండా అప్పారావు




హైద్రాబాద్ అక్టోబర్ 6:తెలంగాణ రైతుల సంక్షేమం, అభివృద్ధి మరియు రైతుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండా అప్పారావు నియమితులైనారు. ఈ మేరకు రైతు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండా అప్పారావు

కొండా అప్పారావు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా సంఘానికి మంచి గుర్తింపు తీసుకవస్తున్నాను.

రైతుల సమస్యల పరిష్కారం కోసం, రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తూ, రైతుల హక్కుల సాధనలో ముందుండి సంఘాన్ని మరింత బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు.

## ఈవీఎం గోడౌన్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

### - జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

రంగారెడ్డి జేంద్రనగర్ లోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు) గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. సాధారణ పరిశీలన కార్యక్రమంలో భాగంగా గోడౌన్ లో భద్రపరిచిన ఎన్నికల సామగ్రి, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్ కు ఏర్పాటు చేసిన సీల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు (బీయు), కంట్రోల్ యూనిట్లు (సీయు), వీవీప్యాట్ (వీవీపీఏటీ) యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని నిబంధనల ప్రకారం భద్రపరిచిన విధానాన్ని పరిశీలించారు. ఎన్నికల సామగ్రి నిల్వ, నిర్వహణలో నిర్దేశిత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.గోడౌన్ పరిసరాల్లో భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సీసీటీవీ నిఘా, పోలీసు బందోబస్తు తదితర భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంల భద్రత, సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు: బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అరెస్ట్

**సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారన్నది ప్రధాన ఆరోపణ**

**ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ**

**ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**



క్రిశాంక్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ వివాదాస్పద బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వద్ద అభ్యంతరకర రీతిలో బ్యానర్లు ప్రదర్శించారన్న అభియోగంపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, మెడికవర్ ఆసుపత్రికి సంబంధించి రూ. 13,200 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ క్రిశాంక్ తన అనుచరులతో కలిసి ఆసుపత్రి వెలుపల బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఉపయోగిస్తూ, ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లుగా వ్యంగ్యంగా వీటిని రూపొందించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి కుమార్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 5న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రిశాంక్, 'వీ= మీడియా తెలంగాణ" ప్రతినిధులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదయ్యాయి.

అరెస్టుకు ముందు క్రిశాంక్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, వివాదాస్పద లావాదేవీల ద్వారా సల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన వ్యాపార ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే కేసులో గతంలో బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్, వినీత్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.

ముఖ్యమంత్రి అవినీతిని ప్రశ్నించినందుకే కక్షపూరితంగా క్రిశాంక్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ఉంటామని ఆయన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు.

మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి కుటుంబానికి మెడికవర్ ఆసుపత్రితో ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. తాజా అరెస్టు పరిణామాలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ముదిరాయి.

# గ్రేటర్ కమిషనర్ కు హైకోర్టు నోటీసులు



హైదరాబాద్, అక్టోబరు 6 గాంధీ జయంతి సందర్భంగా నగరంలో మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించారంటూ దాఖలైన పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.తార్నాకకు చెందిన న్యాయ విద్యార్థి వడ్ల శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో ఇలాంటి ఉత్తర్వులపై శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. స్లాటర్‌హౌస్‌లు, మాంసం దుకాణాల మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్ఎంసీ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరించారు.అయితే, ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్లాటర్‌హౌస్‌లు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని సెప్టెంబర్ 30న జీహెచ్ఎంసీ పత్రికా ప్రకటన విడుదల చేసిందని ఆయన వాదించారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం రూపొందించిన నిబంధనలను గెజిట్‌లో ప్రచురించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మాంసం దుకాణాల మూసివేత వ్యాపారుల ప్రాథమిక హక్కులను (ఆర్టికల్ 19(1)(జి)) ఉల్లంఘిస్తుందని తెలిపారు.కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయనకు రూ.50,000 జరిమానా విధించాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం, కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 2వ తేదీకి వాయిదా వేసింది.

## సుప్రీంకోర్టు ఘాటు వాఖ్యల నేపథ్యంలోనైనా ఎన్నికల ప్రధాన కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాలి.

## నరేంద్ర మోడీ, అమిత్ షా కనుసన్నల్లోనే ఎన్నికల కమిషనర్ నిర్ణయాలు

### - సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ

సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యల నేపథ్యంలో జాతీయ ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ హైదరాబాదు నుండి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు అనుమతితోనే కాలం 6 కు సవరణలు అనుమతి తెచ్చామని గతంలో ఎన్నికల కమిషన్ గతంలో ప్రకటించిందని, ఎన్నికల కమిషన్ చెబుతున్న మాటలు అవాస్తవాలు, అబద్దాలు అని దీని ద్వారా బహిర్గతం అర్థమవుతుందన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కూడా ఆ రికార్డులను తీసుకురావాలని ఆదేశాలు ఇచ్చారని, కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గు గా వ్యవహరించిందని, ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా ఏమి జరగనట్లు నటిస్తున్నట్లు వారు అన్నారు. మోడీ, అమిత్ షా కనుసన్నల్లోనే ఈ ఓట్ల తొలగింపు వ్యవహారం నడిచిందని, వారి సహకారంతోనే ఎన్నికల కమిషనర్ దేశవ్యాప్తంగా 12 కోట్ల కోట్లు తొలగించడానికి పథకం సిద్ధం చేశారని వారన్నారు. ఎన్నికల సంఘంలో ఉన్న ఇతర ఇద్దరు కమిషనర్లు గత పది మాసాలుగా 14 సార్లు అభ్యంతర వ్యక్తం చేస్తున్నప్పటికీ వారి మాటలను ఖాతరు చేయకుండా నిరంకుశంగా, ఏకపక్షంగా ఎన్నికల కమిషనర్ నిర్ణయాలను తీసుకున్నారని వెంటనే జాతీయ ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని అన్నారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఈరోజు ఢిల్లీలో నిరసనలు జరుగుతున్నాయని, పదవ తేదీన ఆధ్వర్యంలో కి?జెపి ఆధ్వర్యంలో నిరసనలు, నవంబర్ 1న దేశవ్యాప్తంగా ఉన్న ఇండియా కూటమి నాయకులు ఢిల్లీకి వచ్చి నిరసన తెలియజేయనున్నారని వారన్నారు. నరేంద్ర మోడీ, అమిత్ షా తమ తప్పుని ప్రజల ముందు అంగీకరించాలని, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసి తొలగించబడిన ఓట్లను పునరుద్ధరించాలని రామకృష్ణ తెలిపారు.

# కాలువలో చిక్కుకున్న అడవి దున్న మృతి

## రెస్క్యూ టీం కాపాడేలోపే విషాదం.. మూడు రోజులుగా ఆహారం లేక నీరసించిన వన్యప్రాణి

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 6:** వేంసూర్ మండల పరిధిలో అడవి దున్న సంచారం సోమవారం తీవ్ర కలకలం రేపింది. చోడవరం--కల్లూరుగూడెం ప్రధాన రహదారిలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే సమీపంలోని మామిడి తోట వద్ద ఉన్న చెరువు కాలువలో అడవి దున్న చిక్కుకుపోయింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ రెస్క్యూ బృందం అక్కడికి చేరుకుని దానిని సురక్షితంగా బయటకు తీసేందుకు ప్రయత్నించింది. అయితే, రెస్క్యూ చర్యలు ప్రారంభించిన కొద్దిసేపటికే అడవి దున్న ప్రాణాలు విడిచింది. అటవీశాఖ అధికారుల వివరాల ప్రకారం.. సుమారు మూడు రోజులుగా కాలువలో





చిక్కుకుపోయిన అడవి దున్న ఆహారం అందక తీవ్రంగా నీరసించింది. ఈ క్రమంలో ఒక్కసారిగా షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు.

పై అధికారుల సూచనల మేరకు అటవీశాఖ నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతిచెందిన అడవి దున్నను కొమ్మేపల్లి అటవీ ప్రాంతంలో ఖననం చేసినట్లు సత్తుపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సీహెచ్ ఎల్లయ్య తెలిపారు.

అటవీ పరిసర గ్రామాల్లోకి వన్యప్రాణులు ప్రవేశించినప్పుడు ప్రజలు వాటిని తరిమే ప్రయత్నం చేయకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వన్యప్రాణులకు ప్రమాదం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కల్వేమల్‌లో ఇళ్లలో చోరీ

## నగదు, బంగారం అపహరణ.. పత్రాలు ధ్వంసం





**జహీరాబాద్, అక్టోబర్ 6 ప్రజాబలం ప్రతినిధి:** న్యాల్‌కల్ మండలం కల్వేమల్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. రెండు ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారాన్ని అపహరించడంతో పాటు విలువైన భూ పత్రాలు, పట్టా పాస్‌పుస్తకాలను చించివేసి పరారయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో కలకలం నెలకొంది. గ్రామానికి చెందిన ఎర్నెర్లీ బసవరాజు ఇంట్లోకి చొరబడిన దుండగులు ఇంట్లో దాచిన రూ. 1.50 లక్షల నగదుతో పాటు ఆరు మాసాల బంగారాన్ని అపహరించారు. అనంతరం ఆయనకు సంబంధించిన భూమి పత్రాలను చించివేసి ధ్వంసం చేశారు. ఆ తర్వాత పక్కనే ఉన్న గుర్నాక్ ఇంట్లోకి ప్రవేశించిన దొంగలకు నగదు, విలువైన వస్తువులు లభించకపోవడంతో అక్కడ ఉన్న పట్టా పాస్‌పుస్తకాలను చించివేసి వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు హద్నూర్ ఎస్సై సుజిత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

# పాఠశాలను సందర్శించిన ఏసీఎంవో, ఏటీడీవో

## విద్యార్థుల సామర్థ్యం పరిశీలన, సంతృప్తి వ్యక్తం.

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 6:** అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏసీఎంవో) ఎల్.రాములు, వైరా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి (ఏటీడీవో ) పి.రమేష్ మంగళవారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యా, బోధనా కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల తీరును పరిశీలించి, విద్యార్థుల పరీక్షల





నిర్వహణ,మూల్యాంకన విధానాన్ని సమీక్షించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటీడీఏ భద్రాచలం వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉద్దీపకము-3 తీరు తెన్నులను పరిశీలించి విద్యార్థుల స్థాయిని, ప్రగతిని పరిశీలించారు.

అనంతరం పాఠశాలలోని వివిధ విద్యా, పరిపాలనా రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణ తీరుపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు మరింత ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని సూచించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, అభ్యసన స్థాయిలు, పరీక్షల ఫలితాలు తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు నూతన బోధనా పద్ధతులను అనుసరించాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ఏటీడీవోలు సూచించారు. మధ్యాహ్నం అందించిన మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరంఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ఏటీడీవో లు అందించిన సూచనలు, సలహాలను పాటిస్తూ పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తామని తెలిపారు .కార్యక్రమంలో ఎస్.సీ.ఆర్.పి బి.బాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు, డిప్యూటీ వార్డెన్ డిఎస్. నాగేశ్వరరావు ఉపాధ్యాయులు బి. శోభన్ నాయక్, బి.సక్రాం, కే.శ్యామల, పాయం శ్రీనివాస్,ఎం. చంద్రావు, డి వెంకటరమణ, బి.వసంత దేవి,బి.రవి, బి.సింగ్య,బి.సక్రాం,ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# సి.ఎం.సి కమిషనర్ను కలిసిన యునైటెడ్ ఫెడరేషన్ బృందం




**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 6 అక్టోబర్ 2026**యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ – తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి బృందం అధ్యక్షులు సీతారాం ధూళిపాల, సైబరాబాద్ చాప్టర్ అధ్యక్షులు రమణ, విశ్వనాథ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వి వి రావు, బద్రీనాథ్, పాతూరి శ్రీనివాస్, పద్మ శ్రీనివాస్, దీప్తి, మదన్ మోహన్, మహేష్ బాబు తదితరులు మంగళవారం రోజున హైదరాబాద్‌లోని ఎన్.ఏ.సి హైటెక్స్‌లో గల సి.ఎం.సి కార్యాలయంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఐ.ఏ.ఎస్ ని మర్యాద పూర్వకంగా కలసి స్థిరమైన పట్టణ పాలన పట్ల హరిత నిబద్ధతకు చిహ్నంగా మొక్కను అందించి, ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) చట్టం 2026 పై ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన వారి పాత్రలు తగ్గినప్పుడు ఏర్పడే  అంతరాయాన్ని మెమోరాండం ద్వారా ఎత్తి చూపిన విషయం జ్ఞాపకం చేసినారు. క్యూర్ ఫ్రేమ్ వర్క్‌లోకి రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనిట్లు నిర్మాణాత్మక ఏకీకరణ, పొరుగు ప్రాంతాల పౌర ప్రాధాన్యతల కోసం అధికారిక సంప్రదింపుల యంత్రాంగం, భాగస్వామ్య బడ్జెటింగ్, పురపాలక బడ్జెట్‌లలో రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ల ప్రాధాన్యతలను ఏకీకృతం చేయడం, క్యూర్ పౌర భాగస్వామ్య పోర్టల్ నమోదు, ట్రాకింగ్, జవాబు దారీతనం విషయంపై చర్చల్లో భాగంగా ప్రస్తుతం జయదర్శిని రెసిడెన్సీ పక్కనే ఉన్న అక్రమ భవనం కూలిపోవడం వల్ల ప్రభావితమైన అమాయక నివాసితులకు నష్టపరిహారం, శిల్ప డ్రీమ్ వ్యాలీ కొల్లూరులో 112 ఎకరాలలో 13 ఎకరాల కుంభకోణంలో 20% ఖాళీ స్థలాలు గల్లంతు, ఇజ్జత్ నగర్ అనధికార భవనాలపై 120 కి పైగా ఫిర్యాదులు వచ్చినా చర్యలు చేపట్టలేదని వివిధ అంశాలపై చర్చించారు. అందుకు యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ తెలంగాణ వంటి విస్తృత వర్గాలతో మేధోమథనం చేయడం మరింత ఉపయోగకరంగా ఉందని కమిషనర్ అభిప్రాయ పడ్డారు. ప్రజల కేంద్రీకృత, రాజ్యాంగ బద్ధమైన మరియు అమలు చేయదగిన సూచనలను కమిషనర్ అభినందించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మరియూ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల మధ్య నిర్మాణాత్మక సహకారం కొనసాగుతుందని హామీ ఇవ్వడంతో, తమ మాటలను ఓపికగా విన్నందుకు కమిషనర్ డాక్టర్ శ్రీజనకి ప్రతినిధి బృందం ధన్యవాదాలు తెలిపింది.

# గుబ్బగుర్తి పాఠశాలలో వన్యప్రాణుల వారోత్సవాలు



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 6:**తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 72వ వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు.




వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, అడవుల ప్రాధాన్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దంతాల ప్రశాంతి నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివన్నారాయణ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జీ. ఉపేంద్రయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి. సైదా, యు. అయోధ్యమ్మ, జ్యోతి, ఏఏపీసీ చైర్‌పర్సన్ నాగమణి పాల్గొన్నారు.

అలాగే ఉపాధ్యాయులు మురళీకృష్ణ, లలిత భారతి, వెంకటేశ్వర్లు, చారి, సుజాత, భాస్కర్తో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన్యప్రాణులు, అడవులు మరియు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్యక్రమ నిర్వాహకులు ఉపేంద్రయ్య తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా267విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభం:

తిరుపతి  గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకే ప్రాథమిక వైద్య సేవలు, ముందస్తు నివారణోపాయాలు మరియు అవసరమైన హెల్త్ స్క్రీనింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా నిర్మించిన 267 విలేజ్ హెల్త్ క్లినిక్స్ ( వి హెచ్ సి) భవనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రివర్యులు  సత్యకుమార్ యాదవ్ గుడివాడ నియోజకవర్గంలో నిర్వహించిన ముఖ్య కార్యక్రమంలో వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ( ఎన్ హెచ్ ఎం ), ఉపాధి హామీ పథకం ( ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ), ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ( పీఎం – ఏ బి హెచ్ ఐ ఎం) మరియు 15వ ఆర్థిక సంఘం నిధుల భాగస్వామ్యంతో ఈ భవనాల నిర్మాణాలను పూర్తి చేశారు. ఈ రాష్ట్రస్థాయి ప్రారంభోత్సవంలో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఐఏఎస్  హాజరై తిరుపతి జిల్లా పరిధిలోని 4 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను వర్చువల్‌గా ప్రారంభించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని బి.వి.పురం మరియు ఆకృతి, వెంకటగిరి నియోజకవర్గంలోని సంగనపల్లి, గూడూరు నియోజకవర్గంలోని దుగ్గరాజుపట్నం క్లినిక్‌లు ఇందులోకి వస్తాయి. ఈ కార్యక్రమంలో ఏపీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్. చెంచునాయుడు, హ్యాబిటేషన్ వర్క్స్ కమిటీ చైర్మన్లు, శ్రీకాళహస్తి టిడిపి పార్టీ ప్రెసిడెంట్  ఎ. కృష్ణ యాదవ్, తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీమ్ మరియు హెచ్ ఓ ) డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్,  డిపిఆర్ఈఓ డి. మధుసూదన మరియు వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో మరియు ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ క్లినిక్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# ఏజెన్సీ ప్రాంత వాసులకు అందుబాటులో దంత వైద్యులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 06 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలలో మారుమూల ప్రాంతాలైన మంగపేట కన్నయ్య గూడెం వాజేడు వెంకటాపురం తాడ్వాయి మండలాల ప్రజలకు అందుబాటులో డాక్టర్ భరత్ రెడ్డి దంత వైద్య నిపుణులు అందుబాటులో ఉంటూ దంతాలకు సంబంధించిన అన్ని రకాల సమస్యలకు పరిష్కారం తెలియజేస్తూ అలాగే పిప్పి పన్నులను సైతం తీసివేసి దంత సమస్యల నుంచి గ్రామీణ ప్రాంత వాసులకు మంచి అవకాశం ఉన్నందున ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని సామాజిక వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సురేష్ కుమార్ తెలియజేశారు

# నకిలీ సందేశాలకు ఎవరూ స్పందించవద్దు.

## ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 06 కలెక్టరేట్** ములుగు జిల్లా ప్రజలకు అధికారులకు జిల్లా కలెక్టర్ స్పందించవద్దని సూచించారుతన పేరు, ఫొటోను వాట్సాప్ డి.పి.లో పెట్టుకుని ౦66 98 476 2993 నంబర్ నుంచి అధికారులకు సందేశాలు పంపుతున్నట్లు గుర్తించామని తెలిపారు.



ఈ నంబర్ నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని, వెంటనే సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, వాట్సాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

తన పేరు, ఫొటో కనిపించినంత మాత్రాన అపరిచిత నంబర్ల నుంచి వచ్చే సందేశాలను విశ్వసించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాంటి సందేశాల ద్వారా డబ్బులు, బహుమతి కార్డులు అడిగినా స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, రహస్య సంకేత సంఖ్యలను ఎవరికీ ఇవ్వవద్దని కోరారు.

సైబర్ నేరగాళ్లు ప్రముఖుల పేర్లు, ఫొటోలను ఉపయోగించి ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. తన పేరుతో అనుమానాస్పద సందేశాలు వస్తే సంబంధిత సైబర్ నేరాల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రజలు, అధికారులు, సిబ్బంది జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# ఫ్యాన్‌కు ఉరేసుకుని మహిళ మృతి

## కిష్టారంలో విషాదం.. మృతదేహానికి డాక్టర్ దయానంద్ విజయ్ కుమార్ నివాళి.

## మృతికి కారణాలు తెలియరాకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు.

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 6:** సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలోని బీసీ కాలనీలో సోమవారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఇమ్మనబోయిన విష్ణు ప్రియ (38) మృతి చెందారు. ఆమె మృతికి గల కారణాలు తెలియరాకపోవడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్‌కు చెందిన విష్ణు ప్రియ, వెంకటనారాయణ ప్రేమ వివాహం చేసుకుని సుమారు పదేళ్లుగా కిష్టారం గ్రామంలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి సుమారు 10 గంటల వరకు కుటుంబ సభ్యులతో కలిసి ఉన్న విష్ణు ప్రియ అనంతరం ఇంట్లోని గదిలోకి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు.

వెంటనే ఆమెను స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి, అనంతరం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే విష్ణు ప్రియ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త వెంకటనారాయణతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సమాచారం అందుకున్న సత్తుపల్లి పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. విష్ణు ప్రియ మృతికి అసలు కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మృతదేహానికి డాక్టర్ దయానంద్ నివాళి

విష్ణు ప్రియ మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీని సందర్శించారు. మృతదేహానికి నివాళులర్పించిన ఆయన.. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనంతరం కుటుంబ సభ్యులను అడిగి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. విష్ణు ప్రియ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కిష్టారం, సత్తుపల్లి ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి..

## సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ సత్యవతి









**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 6 :** గర్భిణీలు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి సూచించారు.

మంగళవారం సెక్టార్ సూపర్‌వైజర్ రజినీ ఆదేశాల మేరకు అయ్యగారిపేట 6వ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ బి.విజయమ్మ ఆధ్వర్యంలో 9వ పోషణ మాసోత్సవం, పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ సత్యవతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాధాన్యత, అంగన్వాడీ సేవలపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సేవలను పొందాలని కోరారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన 10వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మట్టా దేవజ్యోతి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలు పాటించాలని అన్నారు. చిన్నారులకు, గర్భిణీలకు అవసరమైన వ్యాక్సినేషన్‌ను సకాలంలో వేయించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అవగాహన కల్పించారు.

సెక్టార్ సూపర్‌వైజర్ రజినీ మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాల వయసున్న పిల్లలందరినీ ప్రతిరోజూ క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు.

అనంతరం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు శ్రీమంతం, మూడేళ్ల చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయమ్మ, వెంకటమ్మ, ఉష, సత్యవతి, ఆయాలు, చిన్నారులు, తల్లులు, వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఏ యు పి ఎస్ బయ్యక్క పేట పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 06 మంగపేట**మంగపేట మండలంలోని బయ్యక్కపేటలోని గిరిజన సంక్షేమ ప్రాథమికోన్నత పాఠశాల (ఏ యు పి ఎస్ ను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి పాఠశాలలోని విద్యా పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా పీఓ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల నోట్‌బుక్స్, అభ్యసన స్థాయి, విద్యా ప్రగతిని పరిశీలించి, పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, డార్మిటరీ తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పాఠశాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు తరగతి బోధన, విద్యార్థుల అభ్యసన ప్రగతి, హాజరు మరియు పాఠశాల నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలని పీఓ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

## ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం

హైదరాబాద్ , అక్టోబరు 6 తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు.ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఛైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఈ నకిలీ పత్రాలను పరిశీలించి, ధ్రువీకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఆయన కోరారు. మోసం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమి పరిశీలన..

**ముత్తగూడెంలో దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్.**

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 6:** ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు అందించి, వారి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ అన్నారు.



పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమిని ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని అర్హులైన నిరుపేద కుటుంబాలకు పట్టాలు అందించి, ఇళ్ల నిర్మాణానికి వినియోగించే అంశంపై అధికారులతో చర్చించారు.

గ్రామంలో ఇళ్లు లేని పేద కుటుంబాలను గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి ఇళ్ల స్థలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు, ముత్తగూడెం గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్లు మంజూరు చేయాలి..
# విద్యుత్ కోతలు నివారించాలి..

**సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా**

**రాష్ట్ర ప్రభుత్వంపై పోటు రంగారావు తీవ్ర విమర్శలు..**

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 6:** అర్హులైన ప్రతి ఒక్కరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని, జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ కోతలను తక్షణమే నివారించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు.




మంగళవారం సత్తుపల్లిలోని నీలం రామచంద్రయ్య భవనం నుంచి కాకర్లపల్లి రోడ్డు, పాత సెంటర్, కల్పతరువు రోడ్డు, రింగ్ సెంటర్ మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పోటు రంగారావు మాట్లాడుతూ జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా విద్యుత్ కోతలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యుత్ కోతల కారణంగా సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని, కౌలు రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, తలసేమియా బాధితులు, అనాథలు తదితర అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం సంవత్సరాల తరబడి జాప్యం చేస్తోందని ఆరోపించారు.

ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు

నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రంగారావు అన్నారు. తక్కువ ఆదాయంతో కుటుంబాలను పోషించుకోలేక ప్రజలు అర్ధాకలితో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నూతన విద్యుత్ సవరణ చట్టం పేరుతో వినియోగదారుల ఇళ్లకు విద్యుత్ మీటర్లు బిగించి, అధిక విద్యుత్ చార్జీల భారం మోపే ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపడం, ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం కొనసాగిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య, జిల్లా నాయకులు గంట శ్రీనివాస్, బిరెల్లి లాజర్, అమర్లపూడి శరత్, డివిజన్ నాయకులు రాజు, వెంకటేష్, నాగిరెడ్డి, పుల్లారావు, మ్యాలాద్రి రాజారావు, నాగ ప్రసాద్, దేవి, అలివేలు, వెంకటమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ దాడులను ఖండించిన టిడిపి ఎస్సీ నాయకులు

పిడుగురాళ్ల గురజాల నియోజకవర్గం శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వైసిపి మూకలు మాచవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ నాయకుల మీద చేసిన దమనకాండను ఖండిస్తూ పిడుగురాళ్ల పట్టణ మరియు మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ పాత్రికేయుల సమావేశంలో పిడుగురాళ్ల పట్టణ టీడీపీ అధ్యక్షులు పిల్లి చెన్నారావు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుక్కముడి జార్జ్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఫణితి రవికుమార్, మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు లంజపల్లి కొండలు, పట్టణ టిడిపి అధికార ప్రతినిధి మంద డేవిడ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చల్లగుండ్ల రూబెన్, 26వ వార్డు ఇంచార్జి ఐతం పెద్ద మాణిక్యరావు, 18వ వార్డు ఇంచార్జి వర్ల రత్నం, బొక్క శ్రీనివాసరావు, మంద అరుణ్ కుమార్, ఏసు పొంగు ఏసు, 24 వ వార్డు ఇంచార్జి ఫణితి కాంతారావు, చల్లగుండ్ల అభి, గాలి మాణిక్యరావు, మంద ఏసుబాబు, చింతపల్లి ఎర్రయ్య, కొదమొల పున్నయ్య, పత్రా సుధాకర్, కుక్కముడి బాబు, చల్లగుండ్ల పేతురు, గుజ్జర్లపూడి పురుషోత్తం, ఐ-టీడీపీ దొండపాడు రాజేష్, చాట్ల సునీల్, మంద జెట్టీ, గన్నేపోగు శ్యామ్, గద్దల నవీన్, బొక్క ఏసోబు, ఇనుముక్కల వరప్రసాద్, గోపాల్, సురేష్, గాలి లక్ష్మి కోటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 6 ఏటూరు నాగారం** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరు నాగారం నందు అటవీ శాఖ మరియు ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో "జాతీయ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల" సందర్భం గా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్,బి. రేణుక అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏటునాగారం దక్షిణ అటవీ క్షేత్ర అధికారి అబ్దుల్ రెహమాన్ పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలు, వన్యప్రాణి సంరక్షణ వలన కలిగే లాభాలు మరియు అడవులు అంతరించిపోతే జరిగే నష్టాన్ని విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.



ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ సిహెచ్. వెంకటయ్య, డాక్టర్, డి.నవీన్, డాక్టర్, పి. జ్యోతి, కనీస్ ఫాతిమా, సంపత్, జీవవేణి ,రమేష్, శ్రీధర్ ,రాజశేఖర్, భావన ,భారతి, భాస్కర్ ,శ్రీకాంత్, ప్రశాంతి , బోధనేతర సిబ్బంది మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దయానంద్ విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఈనెల 7న నిర్వహించాల్సిన దళిత జర్నలిస్టుల ఫోరం 11 వ రాష్ట్ర మహాసభలను వచ్చే వారానికి వాయిదా

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 06 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, వీరి సూచనల మేరకు, ఈనెల 7న నిర్వహించాల్సిన దళిత జర్నలిస్టుల ఫోరం (డీజేఎఫ్) 11వ రాష్ట్ర మహాసభలను వచ్చే వారానికి వాయిదా వేసినట్లు, ఫోరం రాష్ట్ర నాయకులు తెలిపారు, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, గడ్డం వివేక్ వెంకటస్వామి, సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు, దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్, రాష్ట్ర అధ్యక్షులు తలారి యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఏ,డేవిడ్, మెదక్ జిల్లా అధ్యక్షులు రాపాక విజయరాజు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామని అశోక్, ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు, రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీల ముఖ్య నాయకులు సమావేశమై చర్చించిన అనంతరం, మహాసభల తేదీని మార్చాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు, రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా, మంత్రులు హాజరు కావాల్సి ఉండగా, అదే తేదీల్లో ప్రభుత్వ కార్యక్రమాలు ఉండడంతో, వారు పాల్గొనలేని పరిస్థితి ఏర్పడిందని, వివరించారు, మంత్రుల సూచన మేరకు, వచ్చేవారం సంగారెడ్డిలో 11వ రాష్ట్ర మహాసభలను, నిర్వహించనున్నట్లు తెలిపారు, మహాసభలకు సంబంధించిన కార్యక్రమాలు ఏర్పాట్లు యధావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు, రాష్ట్ర నాయకులు,జిల్లా కమిటీల సభ్యులు,ఈ తేదీ మార్పును గమనించి సహకరించాలని, మహాసభలను విజయవంతం చేయాలని, ఫోరం నాయకులు కోరారు.....



# అంగన్వాడీ టీచర్ పోస్టుకు ఎలిజిబుల్ జాబితా



**మెదక్ ఉమ్మడి జిల్లా ప్రజాబలం ప్రతినిధి యెదుగని అంజయ్య :**నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో అంగన్వాడీ టీచర్ పోస్టు భర్తీ ప్రక్రియలో భాగంగా మంగళవారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులతో ఎలిజిబుల్ జాబితాను రూపొందించారు. ఎలిజిబుల్ అయిన ప్రతి అభ్యర్థికి ఇంటర్వ్యూకు సంబంధించిన కాల్ లెటర్లను అందజేశారు. ఈనెల 15న రామయంపేట ఐసిడిసి ప్రాజెక్టు కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తామని ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డ కృష్ణయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలి.

## బాలపేట గ్రామం నుంచి భారీగా తరలిరావాలి.
## మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు పిలుపు.
## ఉదయం 7 గంటలకు అన్నారుగూడెం నుంచి భారీ బైక్ ర్యాలీ.

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 06:**అమరజీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య 33వ వర్ధంతి సందర్భంగా ఈనెల 7న నిర్వహించనున్న వర్ధంతి సభను విజయవంతం చేయాలని తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.బాలపేట గ్రామ మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు అధ్యక్షతన




బాలపేటలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని,వర్ధంతి సభ ఏర్పాట్లు,కార్యక్రమాలపై కార్యకర్తలు,ప్రజలకు దిశానిర్దేశం చేశారు.

అమరజీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య ప్రజా సమస్యల కోసం సాగించిన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి చాటిచెప్పేలా వర్ధంతి సభను ఘనంగా నిర్వహించాలని దొడ్డ శ్రీనివాసరావు కోరారు.రేపు ఉదయం 7 గంటలకు అన్నారుగూడెంలోని దొడ్డ కృష్ణయ్య భవనం నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభం కానుందని,బాలపేట గ్రామం నుంచి



ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సండ్ర వెంకట వీరయ్య హాజరు.

సాయంత్రం జరగనున్న దొడ్డ కృష్ణయ్య 33వ వర్ధంతి సభకు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,ప్రజల అభిమాన నాయకులు సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు,అభిమానులు,పార్టీ శ్రేణులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి అమరజీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్యకు ఘన నివాళులర్పించాలని దొడ్డ శ్రీనివాసరావు కోరారు.

అమరజీవి దొడ్డ కృష్ణయ్య ఆశయాలు, ప్రజా పోరాట స్ఫూర్తిని స్మరించుకునే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. బాలపేట నుంచి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని వర్ధంతి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# జ్ఞానేష్ కుమార్ ను అరెస్టు చేసి.. విచారించాలి

## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి డిమాండ్
## ఢిల్లీలో సేవ్ డెమోక్రసీ ఆందోళనలో.. తెలంగాణ ఎంపీలతో కలిసి పాల్గొని నినదించిన రామసహాయం

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 06:**ఓటు చోరీకి సహకరించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను అరెస్టు చేసి విచారించాలనే డిమాండ్ తో సేవ్ డెమోక్రసీ పేరుతో ఢిల్లీలో మంగళవారం ఈసీ కార్యాలయానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంకతో పాటు విపక్ష ఎంపీలు ర్యాలీ నిర్వహించగా.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పాల్గొన్నారు. మకరద్వార్ నుంచి నిర్వాచన్ సదన్ వరకు ర్యాలీలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు.ఇండియా కూటమి ఎంపీల ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ



రఘురాం రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, ఫారమ్–6, ఫారమ్–7 దరఖాస్తుల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆరోపిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఓట్లు దొంగలించిన సీఈసీ, ప్రధానమంత్రి దిగిపోవాల్సిందేనని డిమాండ్ చేశారు

# కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్ట్ ఆ ప్రజాస్వామికం

## ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 06 ఏటూరు నాగారం** ఢిల్లీలో ఈరోజు ఓట్లు తొలగింపు విషయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలంటూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో శాంతియుతంగా రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ మరియు ఇండియా కూటమి ఎంపీలు శాంతియుతంగాపార్లమెంటు నుండి ఎన్నికల సంఘం .జు.జ కార్యాలయం వరకు ర్యాలీగా పోతున్న క్రమంలో పోలీసులు అడ్డుకొని శాంతియుతరాలిని జరగనివ్వకుండా అడ్డుకొని గౌరవ రాహుల్ గాంధీ గారిని ప్రియాంక గాంధీ గారిని అరెస్టు చేయడం ఆ ప్రజాస్వామ్యకశీ అన్నారు

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడిందని దేశంలో కోట్లాది ఓట్లను బిజెపి ప్రభుత్వం తొలగించిందని అన్నారు అదేవిధంగా రాష్ట్రాలలో కూడా లక్షల ఓట్లును తొలగించారని తెలియజేసినారు వెంటనే తొలగించిన ఓట్లను చేర్చాలని అన్నారు



# స్వదేశానికి రానున్న సుప్రియ మృతదేహం

**రప్పించేందుకు ఖమ్మం ఎంపీ చొరవకు స్పందన**
**రఘురాం రెడ్డి లేఖతో కదిలిన అమెరికా కాన్సులేట్**
**రెండు రోజుల్లో మృతదేహాన్ని అప్పగించే అవకాశం**
**ఢిల్లీలో ఉండి ఎంబసీ ఉన్నతాధికారులతో పర్యవేక్షిస్తున్న రామసహాయం**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 06:**అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సింహాద్రినగర్‌కు చెందిన కొదుమూరు సుప్రియ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఎంపీ మెయిల్ కు స్పందించిన అమెరికాలోని భారత కాన్సులేట్.. మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తరలించేందుకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ఎంపీ రఘురాం రెడ్డి అక్కడి నుంచి ఎంబసీ ఉన్నతాధికారులతో సంప్రదిస్తూ మృతదేహం తరలింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

రెండు రోజులుగా ఎంపీ రఘురాం రెడ్డి కృషి సుప్రియ మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తరలించాలని కోరుతూ ఎంపీ రఘురాం రెడ్డి ఈ నెల 4న కాన్సులేట్‌కు మెయిల్ పంపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అమెరికాలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపారు. హైదరాబాద్‌లోని ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ అధికారులతోనూ మాట్లాడి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరిన విషయం విదితమే.

పోస్టుమార్టం పూర్తయినట్లు తెలిపిన కాన్సులేట్



Kind attention:

Shri R. Raghuram Reddy,

Hon'ble MP (Lok Sabha), Khammam.

Dear Sir,

Kindly refer to your letter dated 4 October 2026 regarding repatriation of mortal remains of Mrs. Kodumuru Supriya, who died in an accident in Missouri, USA.

2. The Consulate is in touch with the family of the deceased as well as with local Indian community regarding repatriation formalities. I also spoke with Shri Kodumuru Ranjith and conveyed deep condolences to him on the tragic demise of his wife. I have assured him of all possible help in the process.

3. Autopsy of the body has been done. The US authorities will issue a death certificate and handover the body after embalming it. We are expecting it to be done in two days' time while we are trying to expedite it. The Consulate will facilitate further transport of the mortal remains. Mobile number of the Consulate official has been shared with Shri Ranjith for ease of coordination.

Warm regards,

M. Anand Prakash
Consul General of India
Chicago
Tel. No. – 312-595-0412

ఎంపీ మెయిల్ కు స్పందిస్తూ.. పోస్టుమార్టం పూర్తయిందని అమెరికాలోని భారత కాన్సులేట్ జనరల్ ఎం. ఆనంద్ ప్రకాశ్ తెలిపారు. అమెరికా అధికారులు మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసే, ఎంబామింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని, రెండు రోజుల్లో మృతదేహాన్ని అప్పగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం భారత్‌కు తరలించే రవాణా ఏర్పాట్లను కాన్సులేట్ సులభతరం చేయనుంది.

సుప్రియ భర్త కొదుమూరు రంజిత్‌తో కాన్సుల్ జనరల్ మాట్లాడి సానుభూతి తెలిపారు. సంబంధిత కాన్సులేట్ అధికారి ఫోన్ నంబర్‌ను ఆయనకు అందజేశారు. మరోవైపు ఎంపీ రఘురాం రెడ్డి సుప్రియ తల్లిదండ్రులతో సోమవారం ఫోన్‌లో మాట్లాడి పరామర్శించగా..మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు అన్ని ప్రయత్నాలు కొనసాగిస్తామని ఈమేరకు మంగళవారం ఓ ప్రకటనలో భరోసా ఇచ్చారు.

# మహిళలు లైంగిక దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలి




**జహీరాబాద్, జూలై 9 (ప్రజాబలం ప్రతినిధి):** మహిళలు, బాలికలు లైంగిక వేధింపులు, దాడులను ధైర్యంగా ఎదుర్కొని తిప్పికొట్టాలని ఎస్సై పుష్పలత రెడ్డి సూచించారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఆదేశాల మేరకు జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో మంగళవారం షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ జహీరాబాద్ సబ్ డివిజన్ హెడ్ కానిస్టేబుల్ నజీరుద్దీన్, గౌతమి మహిళలపై జరిగే నేరాలు, లైంగిక వేధింపులు, గృహహింస, ఈవ్‌టీజింగ్, మహిళల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్‌ల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రేమ పేరుతోనో, ఇతర ఆశలు చూపించో మహిళలను మోసం చేసే అవకాశాలు ఉన్నందున అపరిచితులను నమ్మి వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దన్నారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదని, అనుమానాస్పద లింకులు, అవగాహన లేని యాప్‌లను తెరవకూడదని హెచ్చరించారు. మహిళల రక్షణకు షీ టీమ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి మర్పల్లి మండల బి ఆర్ ఎస్ వైస్ ప్రెసిడెంట్ డి అశోక్




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 6(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు హైదరాబాద్––రంగారెడ్డి––మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి యువత ముందుకు రావాలి మంచి నాయకున్ని ఎన్నుకోవాలి ప్రజల క్షేమం కోరే ప్రతినిధిని ఎన్నుకోవాలంటే యువత రాష్ట్ర రాజకీయాల్లో దేశ రాజకీయాల్లో ముందుండాలనిమర్పల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ డి అశోక్,పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమం గురించిమాట్లాడారుహైదరాబాద్––రంగారెడ్డి––మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం––18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాధారణంగా సంబంధిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా సమానమైన అర్హత పొందిన వారు సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులై ఉంటే పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని అన్నారు

.మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి, వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు పట్టభద్రుడు ఓటరు నమోదుకు దూరం కాకుండా గ్రామాల వారీగా ప్రత్యేక దృష్టి పెట్టి యువత నమోదు కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలోసారించాలని మర్పల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ డి అశోక్ సూచించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com